


# సాతిహాణి

సింగరాజు
రామచంద్రమూర్తి

*మాతృహృదయం వర్ణించడానికి మాటలు చాలవు. కాని కన్నబిడ్డ హృదయంలో మరొకరికి స్థానం లభించడం తల్లి సహించలేదు. అనంతమైన నిస్స్వార్థంలో ఆవగింజంత అసూయ ఎప్పుడూ దోబూచులాడుతుంటుంది. సంఘర్షణకు అదే మూలకారణం.*

---

**వంటింట్లో** పని ముగించుకుని పమిట చెంగుకు చేతులు అద్దుకుంటూ గదిలోకి ప్రవేశించింది పార్వతి. నిశ్చింతగా నిద్రపోతున్న భర్తను చూసి అప్రయత్నంగా డ్రాయరుమీద నున్న టైమ్‌పీస్ కేసి చూసింది. పదకొండున్నర అయింది!

భారంగా నిట్టూర్చింది!

ఏనాడయినా కొంచెం పెందరాళే పని ముగించుకొని బయట పడదామని ప్రయత్నిస్తుంది. కాని ఎంత హడావుడి పడినా ఊరి పొలిమేరలోనే ప్రొద్దుగ్రుంకిం దన్నట్లు తనెంత ప్రయత్నించినా పదకొండులోపల వంటింటిలోంచి ఇవతలకు వచ్చిన రోజు లేదు. నిద్రపోయేసరికి పన్నెండుకాని లేవడం మాత్రం నాలుగుకే!

ఎందుకో మనస్సులో చెప్పలేని బాధ కలిగింది పార్వతికి. ఈ యాంత్రిక జీవితానికి తుది



ఎప్పుడో గాని మొదలు మాత్రం సరిగా మూడు సంవత్సరాల క్రితం జరిగింది. ఈమధ్య కాలంలో తను మానసికంగా మొద్దుబారిపోయింది. ఆ ఇల్లు తనలోని రక్తమాంసాలు తీసుకుంటూందే కాని, మధురంగా నెమరువేసుకుని ముందుకు సాగేందుకు ఒక్క రోజునుకూడా ప్రసాదించలేదు.

బీరువాకు ఉన్న నిలువు టద్దంముందు నిల బడి తనను తను పరీక్షగా చూసుకుంది పార్వతి. తన ముఖంలో ఇదివరకటి నాజూకు నశించింది. కండ్లలో జీవం లేదు. తనొక యంత్రం. ఆ ఇంటిలో తిండికి శరీరాన్ని అమ్ముకునే దాసి! అద్దంలో బొమ్మ మసకబారి పోయింది.

''అర్ధరాత్రివూట అందం కావలసి వచ్చిందే రాణిగారికి!'' అన్నాడు అప్పుడే ఒక కునుకుతీసిన నారాయణ లేచి.

కంగారుగా కండ్లలోని నీరు పమిట చెరుగు లోకి ఇంకించి వెనక్కు తిరిగింది పార్వతి. చేయి మీద ముఖాన్ని ఆనించి పడుకుని తననే పరికి స్తున్న భర్తను చూస్తే ఎందుకో రోజూకన్న మంచి ధోరణిలో ఉన్నాడనిపించింది. ఇదివరలో చాలాసార్లు చెప్పినా ప్రయోజనం లేకపోయిన విష యాన్ని మళ్ళీ కదుపుదామన్న ఆశతో దగ్గరగా వెళ్ళి మంచంమీద కూర్చుంది.

''ఏమిటి, సింగారం పూర్తయివచ్చినా?'' అనడిగాడు నారాయణ నవ్వుతూ ఆమెను చేతితో చుట్టేసి.

పార్వతి ఏం మాట్లాడలేదు. తన మనస్సులో నలుగుతున్న విషయం అతనిముందు ఎలా ప్రారం భించాలా అని తటపటాయించి చివరికి,

''చూస్తూనే ఉన్నారుగా, రోజూ పదకొండు దాటితేకాని వంటింట్లోంచి బయటపడే యోగ్యత ఉండదు'' అంది మెల్లిగా.

ఆమెను చుట్టుకుని ఉన్న అతని చేయి విడి పోయింది. నవ్వు మాయమయింది!

''అవును. సంసారం అన్నాక తప్పదుగా మరి!'' అన్నాడు.

అతనిలోని మార్పును గమనించిన పార్వతి నిరుత్సాహపడిపోయింది. అయినా ప్రారంభించాక పూర్తిచేసి తేదనిపించుకుంటే అదొక సంతృప్తి. ''దేనికయినా ఒక అంతంటూ ఉండాలండీ. పని చేయనని నేనెన్నడూ అనను. మా అమ్మగా రింటిలో మాత్రం రాజభోగాలు అనుభవించానా? కాని ప్రేమతో మాట్లాడి పని చేయించుకోవడం వేరు. ఎంతసేపూ నా దగ్గరినుంచి ఏదో రాబట్టు కోవాలనీ, నేను ఒళ్ళు దాచుకుంటున్నానన్న భావంతోనూ చూస్తే ఎలా? నేను మాత్రం ఆమెలాంటి, ఆడదాన్ని కానూ? పైగా మాట మాటకి బి. ఏ. వరకు చదివావని మిడిసిపాటు! బి. ఏ. లో చేరితేనే ఇంత అహంకారం ఉంటే అది కాస్తా పాసయితే, ఇంక నా తల్లీ, 'మా వాడితో కాపరం చేసేదానివా?' అంటూ ఎత్తిపొడవడం. మీరే చెప్పండి, నే నేనాడయినా చదువుకున్న దాన్నని గర్వపడ్డానా?'' అతన్నే అడిగింది పార్వతి.

దానికి నారాయణ ఏమీ మాట్లాడలేదు; మాట్లాడలేడు కూడా! గదిలో భార్య చెప్పే మాటలు వింటున్నప్పుడు పార్వతిమీద ఎనలేని జాలి కలుగుతుంది అతనికి. ఆమె చెప్పిందల్లా చేసి ఆమె ముఖంలోకి వెలుగు తేవాలని, తనే

సర్వస్వం అని నమ్మి తన జీవితంలో ప్రవేశించిన ఆమెకు ఆనందంకలుగుజేయాలని అనుకుంటాడు. ఆవేశపడతాడు. కాని మర్నాడు తల్లి మాటలు వినేసరికి ఆమెదే రైటనిపిస్తుంది. 'అడ్డాలనాడు బిడ్డలు గాని....', 'తల్లి విషమాయె, పెళ్ళాము బెల్లమాయె' వంటి రెండు మూడు సామెతలతో రాత్రి కంటనీరు పెట్టుకుంటూ పార్వతి అన్న మాటలు, ఆమె రూపం చెరిగిపోతాయి.

'ఆ మహరాజే ఉంటే నా కీ ఖర్మ కలిగేదా! కోడళ్ళ చేతి నీళ్ళు తాగుతూ, కొడుకులు మాట వినకపోతే జీవచ్ఛవంలాగా బ్రతికేకన్నా ఏ నుయ్యో గొయ్యో చూసుకోవడం మేలు' అని ఏడిచే తల్లి మాటలు విని గడగడ వణికిపోతాడు.

తనను కని పాతిక సంవత్సరాలు పెంచిన తల్లి తన భార్య మూలంగా కంటనీరు పెట్టడంతో నిలువునా నీరు కారిపోతాడు. రాత్రి తనకు పరి స్థితిని మరోలా చెప్పిన భార్యమీద కోపం కూడా వచ్చేస్తుంది. విసురుగా భార్య దగ్గరకు పోతాడు ఆ కోపంతోనే, తల్లి ఎదుట భార్యను శిక్షించి తల్లిచేత 'సుపుత్రుడు' అనిపించుకుందా మన్న తహతహతో!

కాని, నూతి పళ్ళెంమీద ఇంటెడు అంట్లూ వేసుకుని మోచేతులదాకా మసిబారిన చేతులతో చెమటపట్టిన, ముడుటిన అతుక్కున్న వెంట్రుక లను ఎగదోసుకుంటూ 'ఎందుకు వచ్చారు?' అన్నట్లుగా అలసిపోయిన కండ్లతో ప్రశ్నించే పార్వతిని చూసి ఉద్రేకం అంతా చల్లారిపోయి మనిషి జావకారిపోతాడు!

గిలుక్కున వెనక్కు తిరిగి ఇంట్లోకి వెళ్ళి పోతాడు!

తల్లి దృష్టిలో అతను 'భార్యాలోలుడు.' 'పెళ్ళాం ముఖం చూస్తేనే చాలు, వాడికి తల్లి

## నాకాస్

నేటినుండి ఉబ్బసపు వ్యాధితో బాధపడనవసరంలేదు, ఈవ్యాధి నిర్మూలనకుగాను 30 సం.ల పరిశోధనా ఫలితముగా లభ్యపరచుకొనబడి పరమ హంస క్రియలగు మూలికలతో తయారైన ఆయుర్వేదవుషధం. ఎంత మొండివ్యాధికైనను తక్షణమే భాధ నివారింపజేయుటయే గాక కొంత కాలము సేవించిన తిరిగి చూపెట్టదు.
8 ఔ. సీసా రు. 3—75. పోస్టేజి ప్రత్యేకము

**ఇండియన్ మెడిసన్‌హౌస్,**
విజయవాడ—2.

ఆంధ్రప్రభ నవల పోటీలలో
ప్రథమ బహుమతి పొందిన నవల

## చక్రభ్రమణం

రచన :
కోడూరి కౌసల్యాదేవి
వెల : రు. 5-00 పోస్టేజి 50 న.పై.
ప్రచురణకర్తలు
సర్వోదయ పబ్లిషర్స్
ఏలూరు రోడ్డు, విజయవాడ-2

## ఆటోమాటిక్ 50 షాట్ల పిస్తోలు

(లైసెన్సు అక్కరలేదు)

50 షాట్లుగల ఆటోమాటిక్ రిపీటెడ్ డయల్ కలిగియున్నది. ఇది పెద్ద ధ్వని, రవ్వలు పుట్టించి అడవి జంతువులను బంది పోటుదార్లను బెదిరిపోయేట్లు చేస్తుంది. విరోధులు దాడి చేసినప్పుడు వగైరా సందర్భాలలో మీకు మేలైన సహకారి. నటకులకు, సినిమా వేషధార్లకు ఉత్తమమైనది, సైజు $9\frac{1}{2}'' \times 4\frac{1}{2}''$ ధర




నం. 666 రు. 9/50, నం. 777 రు. 14/-, నం. 888 రు. 19/—. 200 షాట్లు ఉచితం. అదనపు షాట్లు నూటికి రు. 4/-లు. తోలుకేసు రు. 4/- వి. పి. పి. చార్జీలు రు. 2/- అదనం.

**KUBER & CO., (APP)**
**P O. Box 1268, Delhi-6.**

## మీరు నిద్రించునప్పుడు ఉబ్బసపు తెమడను సడలించును

ఊపిరి దిగదీయుట, దగ్గు, శ్లేష్మము, గొంతు నొప్పి, ఉబ్బసము, రొమ్ము పడిశము, జలుబు మరియు తాపజ్వరము మొదలగు వ్యాధులతో బాధపడు వేలకొలది రోగులు యిక వీటికి భయపడనవసరములేదు. అమెరికా దేశపు ఆధునిక ఔషధముతో శాస్త్రోక్తముగా తయారైన ఈమందు, గుండె, ముక్కు మొదలగు భాగములకు రక్తము ద్వారా వ్యాపించి శ్లేష్మమును హరించును. మీకు వెంటనే ఊపిరి బాగుగానలుపును. దగ్గు శ్లేష్మము తగ్గి పసిబిడ్డవలె నిద్రించగలరు. పూర్తిగా తృప్తి నిచ్చుటకు గ్యారంటీ యివ్వబడిన మెండకో (MENDACO)ను మీ కెమిస్టువద్ద కొనండి.



## పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరగబోతున్నదిన్నీ, నీ సరియైన చర్యను గురించిన్నీ నీవు తెలుసుకొన గోరినట్లయితే ఒక పోస్టుకార్డు పైన నీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోని నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధి నిక్షేపములు, లాటరీ, ఆకస్మాత్తు ద్రవ్య లాభము మొదలగు వానిని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు.—1—25 లకు మాత్రము వి. పి. గా పంపగలము వి. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్టగ్రహము లేమయినా వున్నయెడల శాంతిచేయువిధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకం వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (AW) Jullundur City**


# నాతి చరామి

ఏమయిపోయినా పట్టదు. దానిదగ్గర ఏం మంత్రం ఉందో—ఒక్కసారి అలా చూస్తుంది. వణికిపోతూ గదిలోకి పారిపోతాడు. ప్రయోజకుడు. నా కడుపున చెడపుట్టాడు!' అంటుంది.

'భార్య అనేదానికి కోరిక లుంటాయని, అది కూడా ఒక మనిషేనని, కేవలం ఉంటున్నదామె ఇంటిల్లిపాదికి చాకిరిచేసి తరవాత తన అవసరాలు తీర్చే యంత్రం కాదని ఆయన గ్రహించితే బాగుండును. ఆయనకి తల్లి ఎంత చెప్పితే అంత! ఆవిడ—నీ పెళ్ళాంవైపు చూడద్దు—అంటే అది కూడా మానేస్తారు. ఏం మగవాళ్ళు!' అని బాధగా నవ్వుకుంటుంది పార్వతి భర్తను చూసి.

గతం నేర్పిన అనుభవాన్ని బట్టి తను ఏటూ చర్య తీసుకోలేనని, తీసుకోదగిన తెగువ తనలో లేదని గ్రహించిన నారాయణ ఉభయ పక్షాల వాదనలు వినటం మానుకున్నాడు. ఆ విషయం చర్చకు వచ్చినప్పుడల్లా తప్పుకు తిరుగుతాడు. దానివలన ఇద్దరిలోనూ అసంతృప్తి పెరిగిపోతూందని, ముఖ్యంగా పార్వతి బ్రతుకు హీనంగా తయారవుతూందని అతనికి తెలుసో తెలియదో కాని, విని ఏమీ చేయలేకపోవడంకన్నా వినకపోవడమే మేలని, దానివలన తనకయినా మనశ్శాంతి కలుగుతుందని అతని ఉద్దేశ్యం. కాగం కార్యం గంధర్వులే తీరుస్తారన్నట్లుగా కాలమే ఈ సమస్యను పరిష్కరిస్తుందన్న ఆశాభావం అలవర్చుకున్నాడతను.

అందుకనే చెప్పినదానికి తను ఏమీ మాట్లాడక పోవడం చూసి కండ్లలో నీళ్ళు తిరగబోతున్న పార్వతి ముఖంనుంచి తప్పించుకునేందుకు గభాలున అటు తిరిగి పడుకున్నాడు నారాయణమూర్తి.

ఈ తిరస్కృతి భరించలేకపోయింది పార్వతి. లేచి వెళ్ళి కుర్చీలో కూర్చుంది. మనస్సులోని బాధ నిశ్శబ్దంగా బుగ్గలమీదుగా జారిపోతూంది! క్రిందటి మూడు సంవత్సరాల జీవితం కళ్ళముందు తిరగసాగింది పార్వతికి.

తను కాపరానికి వచ్చీ రాగానే నెల తిరక్కుండా మామగారు పోవడానికి కారణం తన పాద మహిమేనని అత్తగారి ఉద్దేశ్యం. 'చచ్చాడేమో బ్రతికిపోయా డన్నారు' ఇరుగు పొరుగులు. ఈవిడగారి ధాటికి ఆగలేక పిల్లిపిల్లలాగా ఉండేవాడుట ఆయన.

అసలే జబ్బు మనిషి. అంతక్రితం ఆర్నెల్లుగా పక్షవాతంతో తీసుకుంటూ నానా యాతనా పడుతూ, 'ఈయనతో చావొచ్చిపడింది నాకు చాకిరీ చేయలేక' అని భార్యతో మాటలు పడుతూ జీవచ్ఛవంలా ఉన్న ఆయన చూస్తాడనే అసలు పెద్దకొడుకు పెళ్ళి జరిపించారు.

తను కాపరానికి వచ్చాక ఆయనకు పరిచర్యలు చేస్తూంటే తనను చూసి కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ, 'మీ అత్తగారు రాక్షసమ్మా! ఎలా

నిభాయించుకుంటావో! పైగా నా కొడుకు ఉట్టి వాజమ్మ. వాడికీ నా పోలికే! దానిముందు ఒక్క మాట మాట్లాడలేడు. నీ కేమయినా కావలసి వస్తే, కష్టంగా ఉన్నా నీ మరిదికి చెప్పు. వాడే ఏనాటికయినా ఈ ఇల్లు చక్కబెట్టాలి. వాడికి తల్లి తరహా వచ్చేదు. భయం లేకుండా ఆ విషయమే కుండ పగలకొట్టినట్టు అనేస్తాడు. చాలా మంచివాడు కూడా! వాడే అణచాలి దాన్ని. ఆస్తి తనపేర ఉందని భాగవతం ఆడుతూంది' అనేవా డాయన.

కొత్తగా వచ్చిన రోజుల్లో ఆయనన్ను చూస్తూంటే తండ్రి జ్ఞాపకంవచ్చి నిండుగా ఉండేది తనకు. కాని తీరా ఆయన పోయాక, 'తల్లి కాలు పెట్టింది. నా పసుపు కుంకుమ మాయం చేసింది' అంది అత్తగారు.

''భర్త అంటే పసుపు కుంకుమకి మించి ఈవిడ కింకేమయినా గౌరవం ఉందా'' అని నవ్వుకుంది తను. ఆయన బ్రతికుండగా మంచి నీళ్ళయినా ఇవ్వనిది ఆయన పోవడం తనవలననే నని, తనావిడకు తీరని కష్టం కలిగించానని అనడం చూసి ఆశ్చర్యపోయింది కూడా.

ఆయనన్నట్టు ఈ ఇంటికి అంకుశం వంటి వాడు శంకరం. ఎవరికీ భయపడని ఆవిడ, చిన్న కొడుకుంటే మాత్రం ఎందుకో జడుస్తుంది. కాని దురదృష్టం అనేది తన ముఖాన రాసిఉంటే అతను మాత్రం ఏం చేయగలడు! అతనితో చనువుగా మాట్లాడి కష్టం సుఖం చెప్పుకుంటూంటే చివరికి తమిద్దరిమీదా అనుమానం కూడా పడసాగింది అత్తగారు. 'ఏమిటే, వయసొచ్చినవాడితో ఆ గుసగుసలు? వాడికి లేకపోతే నీకయినా ఉండద్దా బుద్ధి!' అనేది.

కాని తను లక్ష్యపెట్టలేదు, తనలో ఏ లోపం లేనప్పుడు ఒకరికి భయపడవలసిన అగత్యం ఏముంది?—అని. చివరికి తనకున్న అనుమానాన్ని తన కొడుక్కు కూడా నూరి పోసింది ఆవిడ. అసలే తల్లి మాట వేదం ఆయనకు. అటువంటి తల్లి తమ్ముణ్ణి గురించి అలా చెప్పిందంటే ఇక నమ్మకుండా ఎలా ఉండగలడు? 'తమ్ముడంటే అమ్మకి కోపమా? వాళ్ళ చర్యలు ఎంతగా హద్దుమీరితే చెప్పిఉంటుంది అమ్మ తనతోటి?' అని డిగ్రీదాకా తను చదువుకున్న తర్కం అంతా ఉపయోగించి తర్కించుకున్నాడు. 'సాధ్యమయినంతవరకు ఇంటి గుట్టు కాపాడటమే అమ్మ ఉద్దేశ్యం. కాబట్టే గత్యంతరంలేక చెప్పింది ఈ విషయం. దానిమీద చర్య తీసుకోవడం తన తక్షణ కర్తవ్యం' అని తీర్మానించుకున్నాడు నారాయణ.

తనకు మొదట ఇదంతా చాలా బాధ కలిగించింది. లేనిపోని అపవాదును కన్నకొడుకుమీదా, అతనికి తల్లిలాంటి వదినెమీదా వేయడంలో ఈవిడ ఉద్దేశ్యం ఏమిటా అని ఆశ్చర్యపోయింది. కాని తరువాత అందులోని అంతరార్థం గ్రహించి ఆమె ఎత్తుగడకు విభ్రాంతురాలయిపోయింది.

ఉన్న ఊళ్ళోని కాలేజి వదిలి శంకరాన్ని పరాయి ఊరు చదువుకు పంపించారు. ఇది కేవలం నారాయణ ఒత్తిడిమీదనే జరిగింది. తనమీద, వదినెమీద లేనిపోని అనుమానాలతో బాధపడుతున్నాడు అన్నగారు అని గ్రహించిన శంకరం మారు మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

ఇంటిలో నిష్కంటకంగా రాజ్యమేల సాగింది అత్తగారు! మాటను వినేవారే కాని ఎదిరించి 'ఇదేమిటి?' అని అడిగేవారు లేకపోవడంతో మరీ రెచ్చిపోయిం దావిడ. దానికి ఫలితంగా తన పరిస్థితి అధ్వాన్నమయింది. మనస్సులోని కష్టాన్ని ఒకరితో చెప్పుకుంటేనయినా కొంచెం తృప్తిగా ఉంటుంది. అలా వినే శంకరం కూడా లేకపోవడంతో ఎందుకో దిక్కులేని పక్షిలా అనిపించింది.. ఒక్కొక్కసారి లేనిపోనివి కల్పించి కొడుక్కుచెప్పి ఆయన తనమీద చేయి చేసుకునేదాకా రెచ్చగొట్టి చివరికి ఆయన తనను కొడుతుంటే చూసి సంతృప్తి పడేది.

పార్వతికి తను గడుపుతున్న జీవితంమీద ఏనాడో విరక్తి పుట్టింది. చదువుకుని ఉద్యోగం చేసుకుంటూ తన కాళ్ళమీద తను నిలబడగలిగిన వ్యక్తి తల్లికి ఎందుకలా ఝడుస్తాడో అర్థం కాలేదు ఆమెకు. తప్పుంటే తనను తిట్టవచ్చు, కొట్టనూవచ్చు.కాని ఏమీలేకుండా కేవలం తల్లిని మెప్పించేందుకని తనను హీనంగా చూడటం, అంతకన్నా చిత్రం గదిలో తనతో ఆ మాటే చెప్పి క్షమాపణ అడగటం—'అమ్మకోసం నిన్నలా తిట్టాను, పార్వతీ'—అని. అతనిలోని ఈ పిరికితనం తలుచుకుంటేనే ఒళ్ళు మండిపోతుంది పార్వతికి. రేపు 'అమ్మ వదిలేయమంది, పార్వతీ. నన్ను క్షమించు' అంటాడు కూడా అని బాధగా నవ్వుకుంది.

అందుకే తను గడుపుతున్న జీవితం అంటే పార్వతికి అసహ్యం. తన పొట్ట తను తేలిగ్గా పోషించుకోగలదు, బి. ఏ. దాకా చదివింది కాబట్టి. తనిక్కడున్న దానికన్నా ఎక్కువగానే సుఖపడుతుంది కూడా! ఎప్పటి కప్పుడు అనిపిస్తూంటుంది ఈ బానిస బ్రతుకునుంచి బయటపడి స్వేచ్ఛగా ఎగిరిపోదామని! కాని అంతలోనే స్త్రీ సహజమయిన భయం అవరిస్తుంది. భర్త ఏనాటికయినా మారతాడేమో, ఆయన కూడా తనతో సహకరించి తన్ని సుఖపెడతాడేమో నన్న ఆశ. ఆ ఆశతోనే మళ్ళీ ఉదయం యాంత్రిక జీవితం ప్రారంభిస్తూంటుంది. కాని ఆ ఆశ ఆశగానే ఉంటుంది.

ఆలోచనలతోనే నిద్రలోకి జారిపోయింది.

తెల్లవారుఝామున నారాయణ నిద్ర లేపే దాకా మెలకువ రాలేదు పార్వతికి.

''పార్వతీ, లే, లే. అమ్మ అరుస్తోంది'' అని భుజాలు పట్టుకుని కుదిపి లేపాడు నారాయణ.

''భోగం కొంపనుకున్నారా, సంసారులు మనుకున్నారా? సూర్యుడు నడినెత్తికి వచ్చేదాకా గదుల్లోంచి బయటపడరు మహారాణులు! లేచేసరికి కాఫీలు మాత్రం తయారుగా చేతి కందివ్వాలి.


పండిత నోరి రామశాస్త్రిగారి సుప్రసిద్ధ శాస్త్రీయాయుర్వేద ఔషధములు.

**జీవనవటి**

ధాతుపుష్టికి, శరీరము సౌష్ఠవమునకు ఎల్లప్పుడు నిరపాయముగా సేవించదగిన టానిక్

**క్షీరవర్ధని**

తల్లిపాలను వృద్ధిచేయును. 55 సం.ల నుండి తెలివిగల తల్లులచే వాడబడుచున్నది.

**వసంతకుసుమాకరము**

మధుమేహము, అతిమూత్రము, క్షయలను నిర్మూలించును. అనేకులు దీనిని వాడి ఆశ్చర్యకరమగు ఫలమును పొందిరి.

**శ్రీఫలామృతతైలము**

శిరోరోగములను, నేత్రరోగములను పోగొట్టి మెదడుకు చలువచేయు తలనూనె.

**మేహారి**

అన్నివిధములగు చర్మవ్యాధులను, ఏ దశలోనున్న సవామేహమునైనను రూపుమాపును.

**రక్తోజన్**

రక్తవృద్ధిని, నరముల శక్తిని, ఉత్సాహమును కలిగించు టానిక్

మావద్ద సమస్త ఆయుర్వేద ఔషధములు దొరకును. అన్ని వ్యాధులకు ఉత్తరం ద్వారా కూడా సలహాల నిచ్చి, ప్రత్యేక చికిత్స చేయబడును. కేటలాగు ఉచితం. ప్రతి గ్రామంలో స్టాకిస్టులు కావలెను.

**ఆయుర్వేద నిలయము**

Post Box 32, Vijayawada-1.

అయినా ఒకర్నని ఏం లాభం! మన బంగారం మంచిదయితేసరి! హయ్యో రాత, దాన్ని చూస్తేనే దడయ్యె నాయనకి!' ఝుంఝా మారుతంలాగా లోపలికి ప్రవహిస్తున్న వాక్ప్రవాహంతో మత్తు పూర్తిగా విడిపోయింది పార్వతికి.

బల్లమీది గడియారం వంక చూసింది. అయిదయింది! ఈ మాత్రం దానికే ఇంత రభసా! "చూడండి. ఇంకా తెల్లవారనన్నాలేదు. ఝాము పొద్దెక్కింది అంటూంది మా అమ్మగారు" అంది లేచి నిలబడి.

నారాయణకు మాత్రం పరిస్థితి చాలా కంగారుగా కనబడింది. "త్వరగా బయటికి వెళ్ళు-పార్వతీ. బావుండదు. మా అమ్మకి కోపం వస్తుంది" అన్నాడు.

నిలువునా మండిపోయింది పార్వతి. విక్షిప్తంగా ఉన్న బాధ అంతా అతనిపట్ల అసహ్యంగా మారిపోయింది ఆ క్షణంలో. "ఛీ! మీరూ ఒక మగాడేనా!" అని విసురుగా బయటికి వెళ్ళిపోయింది.

ప్రాస్పడి పోయాడు నారాయణమూర్తి!


తెల్లవార్లూ కుర్చీలో కూర్చునే నిద్రపోవడంవలన ఒళ్ళంతానొప్పులుగా ఉంది పార్వతికి. అయినా మనస్సులోనిబాధముందు శారీరకమయినది చాలా చిన్నదిగా కనబడింది ఆమెకు.

ఒక్క ఓదార్పు మాట, ఒక్క చిరునవ్వు కోసం ఎంతయినా కష్టపడగలరు మానవులు. ఈ కష్టం ఎంతోకాలం ఉండదులే అని సరిపెట్టుకోనూగలరు. కాని కష్టానికి తగిన ఫలం లేకపోగా లాలించే హృదయం కూడా కరువయిపోతే ఈ కష్టం ఎవరికోసం? ఎవరిని మెప్పించేందుకు అన్న ప్రశ్న రావడం సహజం. ఆ ప్రశ్నకు సమాధానం ఏమీ కనబడకపోవడంతో ఒక విధమయిన మొండితనం వచ్చేస్తుంది.

# నాతి చరామి

పార్వతి పరిస్థితి అలాగే ఉంది. గడియారం ముల్లులాగ సమానంగా పనిచేసినా ఆ ఇంటిలో తనకు రాణింపులేదు. పోనీ భర్తయినా సానుభూతి చూపుతే ఇంత కష్టం ఒక్క క్షణంలో మరిచిపోతుంది కూడా. కాని సానుభూతి లేదు కదా, చాటుసయినా ఆమెను ఓదార్చేపాటి ధైర్యం లేదతనికి.

ఆడది మగాడిలో ఏ అవలక్షణమయినా సహించగలదు గాని పిరికితనం ఉంటే మాత్రం గౌరవించదు.



ముంతాజ్ సమాధి (తాజమహల్)

ఫోటో—ఎ. వి. వి. నరసింగరావు (కర్నూలు)

మనస్సంతా చికాగ్గా ఉంది పార్వతికి. శరీరం మొండి కేస్తున్నా యాంత్రికంగా అంట్లు తోమేస్తూంది.

"అలా వాటిని ముందేసుకొని మంత్రాలు చదువుతే మసిపోతుందా నా తల్లీ! ఎందుకొచ్చిన పవిరా దేముడా అని ఉసూరుమంటూంటే పనులు జరుగుతాయా? అయినా విన్నవి ఏం లాభంలే! మీ నాయన బి. ఏ. దాకా చదివించిన వాడు మాస్టరీ పాసు చేసుస్తే కళ్ళజోడు, కాళ్ళకి జోడు, గొడుగూ వేసుకుని పంతులమ్మ వయేదానివి, పాపం!" హేళనగా అంది అత్తగారు వంటింటి గుమ్మంలో నిలబడి.

పిల్లిని గదిలోపెట్టి అన్ని తలుపులువేసి కొడితే అది కూడా తెగించి ఎదురుతిరక్కమానదు, దానికి చేతనయిన దేదోచేసి చూపకా మానదు. అటూ, ఇటూ అని ఊగులాడుతున్న 'తుల' గాలి కదలికకయినాసరే ఏటో ఒక అటు మొగ్గి పోతుంది.

ఒక్కసారి నిశ్చయానికి వచ్చినట్లుగా బకెట్టులో చేతులు కడుక్కుని, లేచి నిలబడింది పార్వతి. "ఇవ్వాళ నా వంట్లో బావుండలేదు. పోయి పడుకుంటాను" అనేసి విసురుగా ఇంటిలోకి వెళ్ళిపోయింది.

ఆ దెబ్బనుంచి కోలుకోవటానికి అయిదు నిమిషాలు పట్టింది గంగా భాగీరథిగారికి. కాని అది తుఫాను ముందరి ప్రశాంతత మాత్రమే!

వినబడుతున్న వాక్ప్రవాహానికి నారాయణమూర్తి కాళ్ళు చల్లబడిపోయాయి. పార్వతి, దొడ్డి సావిట్లో పడుకుని ఉండగా, తల్లి ఇంటిమీద విరుచుకుపడటం—ఇవన్నీ చూసి అతనికి మతిపోయినట్లయి హడావిడిగా సైకిలేసుకుని బజారున పడ్డాడు.

గుమ్మంలో రిక్షా దిగి శంకరంతోపాటు లోపలికి రాబోతున్న మాధవరావు లోపలినుంచి దూసుకువస్తున్న మాటలకు ఆగిపోయాడు. శంకరం మాత్రం, "ఫరవాలేదు, రారా మాధవా. స్వాగత వచనాలన్నమాట. మా అమ్మ సంగతి ఎరగవు కాబోలు. కొండొకచో సూర్యకాంతం అంశ" అని నవ్వేసి మాధవరావును కుర్చీలో కూర్చోమని తను ఇంట్లోకి వెళ్ళాడు.

చిన్నకొడుకు రాక చూసి కొంచెం జోరు తగ్గించినా, పూర్తిగా నోరు మూసేస్తే లోకువయిపోతానన్న భయంతో తగ్గుస్థాయిలో తిడుతూనే ఉంది గంగా భాగీరథిగారు. కాని శంకరం మాత్రం ఆవిడ జోలి పట్టించుకోకుండా "వదిన నేది?" అన్నాడు.

దానికి సమాధానం రాకపోయేసరికి, "నిన్నే నమ్మా. వదిన నేది?" అన్నాడు కొంచెం బిగ్గరగా.

"ఎవరికి తెలుసు, రాణీగారు ఏ గదిలో అలకపానుపు నలంకరించారో? అయినా ఈ ఇంట్లో...!!

సగంలోనే అందుకున్నాడు శంకరం: "సర్లే, ఇక ఆపెయ్—వదినా వాళ్ళ అత్తయ్య కొడుకు వచ్చాడు. మనింటి బలా బలాలు తర్వాత తేల్చుకోవచ్చు!.....వదినా!" అని బిగ్గరగా పిలిచాడు.

శంకరం పిలుపు వినబడి దిగ్గున లేచి ఇంట్లోకి వచ్చింది పార్వతి—"ఏం, శంకరం, ఎప్పు డొచ్చావ్?"—అంటూ.

"ఎక్కడున్నావు? నీకోసం ఇల్లంతా గాలించేస్తున్నా ననుకో! మాధవరావు వచ్చాడు" అన్నాడు నవ్వుతూ.

ఎడారిలో చల్లని నీటి పేరు విన్నట్టయింది పార్వతికి. "ఎక్కడున్నాడు? ఎప్పు డొచ్చాడు?" అంది ఆత్రంగా.

"వచ్చి ఒక సంవత్సరమయింది. వీధిలో నిలబెట్టాను!" అని నవ్వి, "ఆవేం ప్రశ్నలమ్మా! సెలవులుగా, పోతూ పోతూ ఇక్క డొకసారి దిగమన్నాను నువ్వు కూడా చూస్తావని! పద, హాల్లో కూర్చుని ఉన్నాడు" అంటూ ఆమెను వెంటేసుకుని వచ్చి, "ఇదుగోరా బాబూ, అలకపానుపుమీద ఉంటే బతిమాలి తీసుకొచ్చాను"

ఉన్నాయి.

మాధవరావు ఒక్కసారి పార్వతి వంక ఎగా దిగా చూసి, "అదేమిటి పార్వతీ, అలాగయి పోయావ్?" అని ఆశ్చర్యపోయాడు.

అప్రియమైన పరిసర్కు వేడెక్కిన హృదయం మీద చన్నీళ్ళు చిలకరింపు లాంటిది. ... ఎదుటే తన పరిస్థితులన్నీ చెప్పేసు ... ని ఏడుద్దామనిపించేంత ఉద్రేకాన్ని ఎంబాలించు ..., "ఎలా ఉన్నాను? బ్రహ్మాండంగా ఉంటే! ... కపోతే నువ్వొచ్చింది ... చేసుకునేవేళ కావట్టి మేకప్‌లో లేను" అంది పేలవంగా నవ్వేసి.

"పచ్చి నిజాన్ని పరుగుపెట్టి మనుష్యుల్ని ... ప్పడంలో పదవాళ్ళది అందెవేసిన చేయిరా మాధవా. అందులో మా వదినకి బి. ఏ. లో ఇదేట మెయిన్!"

"పరువయిన మాటలు మాట్లాడుతున్నావు. ఈ ఊపులోనే కథలు రాయకూడదూ" అని నవ్వి, "శంకరం ఉంటే మా ఇల్లు శాంతికి నివాసం బావా. అందుకనే వూస్టింగ్ వచ్చేసింది" అంది.

శంకరం కొద్దిగా ఆశ్చర్యపోయాడు ఆమె మాటల ధోరణి చూసి. "ఏమిటో ఇవాళ చాలా ధైర్యంగా మాట్లాడుతున్నావు! మీ బావ వచ్చాడనా? వాడుట్టి పిరికి సన్యాసి. మా అమ్మ ఇద్దరినీ కలిపి వాయించేయగలదు."

"ఆడదానికి పిరికితనం ఒక అడ్డం మాత్రమే శంకరం. అవసరమయితే తెగించి చాలామంది మగాళ్ళకన్నా ధైర్యం చేయగలదు, తెలుసా? కాకపోతే ఆ ధైర్యంచేసే అవకాశం ఎప్పుడూ మగాడికే ఇస్తుంటుంది. ఏనాటికయినా అవసరానికి ఆయత్తపడతాడని ఎదురుచూస్తుంది. చివరికి నిస్పృహతో అన్ని బంధాలూ తెంచేసుకునేందుకయినా సిద్ధపడుతుంది" అంది ఉద్రేకంగా.

ఆమె మాటల వెనుకనున్న భావాన్ని గ్రహించిన శంకరం ఏమీ మాట్లాడలేకపోయాడు. మాధవరావుకు మాత్రం వీళ్ళ సంభాషణ పుస్తకాల్లో పాత్రలు అప్పజెప్పే డైలాగుల్లా ఉంది. అందుకే—

"ఏమిట్రా బాబూ, అతిథి దేముడు ఎదురుగా ఉండి అర్థంకాక చస్తున్నాడు అనయినా లేకుండా మరీ శరత్ సాహిత్యంలా మాట్లాడితే ఎలా? వాస్తవికతకి జారండిరా!" అన్నాడు.

ముగ్గురూ నవ్వేశారు.

"స్నానం చేద్దువుగాని లే, బావా" అంటూనే లోపలికి వెళ్ళింది పార్వతి తుండ్లు తెచ్చేందుకని.

ఆమె వెళ్ళినవైపు చూస్తూ, "మా వదిన చాలా మారిందిరా. ఇదివరకటి మనిషి కాదిప్పుడు. ఏదో మొండి ధైర్యంతో ఉన్నట్టు మాట్లాడుతూంది" అన్నాడు శంకరం.

మాధవరావు ఏమీ మాట్లాడలేదు. శంకరం ద్వారా వాళ్ళ ఇంటి పరిస్థితి తెలుసుకున్నాడు అతను. అందుకనే ప్రస్తుతం కొంత ఊహించుకుని తరువాత శంకరం చెబుతే ధృవపర్చుకుందామని ఊరుకున్నాడు.

పార్వతి రెండు తువ్వాళ్ళు భుజాన వేసుకుని గబగబ వచ్చి, "నీ పంతు తర్వాత శంకరం. నువ్వురా, బావా" అని మళ్ళీ లోపలికి వెళ్ళిపోయింది.

ఆ రోజల్లా మాధవరావు వెంట వెంటే తిరిగి అతని కేం కావాలో స్వయంగా కనుక్కుని అన్నీ అందిస్తూంది పార్వతి. మధ్యాహ్నం ముగ్గురూ కలిసి కాస్సేపు పేకాట వేశారు.

"మొన్న మీ స్నేహితురాలు సుశీల కనబడింది, పార్వతీ. ఎమ్. బి. బి. ఎస్. చదువుతూంది, తెలుసుగా? నువ్వు పెళ్ళి చేసుకుని జీవితంతో రాజీ పడ్డావుట—అంది. తరువాత మా యూత్ ఫెస్టివెల్‌కి ఢిల్లీ పోయాను. అక్కడ భానుమతి కనబడింది. రీసెర్చి చేస్తూందిట. పదిమంది మగాళ్ళని వెంటేసుకు పోతుంటే గుర్తు పట్టలేకపోయాను. ఇదివరలో నాతోనే మాట్లాడేది కాదు. 'మా పార్వతికి పిల్లలు కూడానా' అని నవ్వింది. శశిరేఖ స్కాలర్‌షిప్ సంపాదించి విదేశాలకు పోయిందని కూడా ఆ అమ్మాయే చెప్పింది" అన్నాడు మాధవరావు.

"ఏమిటి, వీళ్ళంతా మా వదిన స్నేహితురాళ్ళా లేక నీ నెచ్చెలులా?" అడిగాడు శంకరం.

పార్వతి మాత్రం ఆలోచనలో పడిపోయింది. తనూ చదువుకుని ఉంటే వాళ్ళలాగానే స్వేచ్ఛగా గాలిలో ఎగిరిపోతుండేది. అంతలోనే సుమిత్ర గుర్తుకొచ్చి, 'మరి సుమిత్ర ఏం చేస్తూంది, బావా? యూనివర్సిటీలో చేరిందిగా' అనడిగింది.

కాస్సేపు మాధవరావు మాట్లాడలేదు. శంకరం అతనివంక చూసి నవ్వి, 'చెప్పవేంరా? సిగ్గా?' అన్నాడు.

"నా కెందుకు మధ్య? ఒక్క ఏడాది చదివి మానేసింది, పార్వతీ. ప్రస్తుతం గుంటూరులో ఉద్యోగం చేస్తూంది, ఆర్థిక ఇబ్బందులవలన" అన్నాడు.

ఇంకో రెండాటలు అయాక, 'అలా షికారు పోయొస్తాం వదినా' అని మాధవరావును వెంటేసుకుని బయటికి పోయాడు శంకరం.

అప్పటిదాకా వాళ్ళిద్దరితోనూ సరదాగా గడిచిపోయిన కాలం ఒక్కసారి స్తంభించినట్లయింది పార్వతికి. ఇదివరలో ఎవరయినా తనవైపు బంధువులు వస్తే అత్తగా రేమను కుంటారోనని భయంవలన వాళ్ళతో సరిగా మాట్లాడనయినా మాట్లాడేది కాదు. వాళ్ళ అవసరాలు చూసే బాధ్యత అత్తగారిమీదే వదిలేసి తను అంటీ ముట్టనట్లు ఉండేది. వాళ్ళకేమి చేస్తే ఆవిడ ఏమనుకుంటుందోనని భయంగా ఉండేది. కాని ఈ రోజు తనలోని మార్పు ఆమెకే ఆశ్చర్యంగా ఉంది. పొద్దుటినుంచి ఒక్కపనయినా ముట్టకుండా వాళ్ళిద్దరితోనూ గడిపేసింది. కాలం సరదాగా పరుగులెట్టింది. ఏదో సాధించినట్లు మనసు ఎంతో సంతృప్తిగా ఉంది.

కోడలిలో వచ్చిన మార్పు చాలా ఆశ్చర్యం కలిగించింది, మొదట గంగా భాగీరథిగారికి. తరువాత ఇంటెడు పనిచేసే మనిషి బొత్తిగా చెంబయినా కదల్చకుండా పనంతా తన నెత్తినే పడేసి హాయిగా బావతోనూ, మరిదితోనూ కబుర్లు చెప్పుకుంటూ కూర్చోవడంతో ఆమె కోపం పట్టపగ్గాలు లేకుండా పోయింది. అది ఆమెలోని యుక్తాయుక్త విచక్షణను కూడా నశింపజేసి బయట పరాయి పెద్దమనిషి ఉన్నాడనయినా లేకుండా అడ్డమయిన వాటిమీదా పెట్టి కోడల్ని చెరిగిపోసేసింది.

తల్లి వాగ్దాటికి శంకరం కూడా భయపడిపోయాడు, ఏదో తుఫాను రాబోతూందని. కాని పార్వతి మట్టుకు చలించకుండా నవ్వుతూ,



నటరాజు
(మణిమంగళం)
ఫోటో—'భరద్వాజ' (మద్రాసు-18)

'మా అత్తగారికి ఇవ్వాళనుంచి హోటల్‌తోపాటు వంటికి కూడా పరిశ్రమ ఇవ్వదలుచుకున్నాను, బావా!' అంది.

ఆమెలోని మార్పు శంకరానికి నచ్చింది. ఇలా ధైర్యంగా ఉండి తల్లిని ఎదిరించమని, అప్పటిగ్గాని ఆమె మారదని లోగడ అతి నెన్నిసార్లు చెప్పినా పార్వతి, 'లేదు, శంకరం, పెద్దవాళ్ళు నాలుగన్నా పడటం మన ధర్మం. మంచిది అనిపించుకోవడం కష్టం కాని ఫలానా అమ్మాయి పొగరుబోతు అన్నది రావడం ఎంతోసేపు పట్టదు' అనేది. అటువంటి మనిషి ఇప్పుడిలా మాట్లాడటం అతనికి ఆశ్చర్యం కూడా కలిగించింది.

బయటికి వెళ్ళాక ఆ మాటే అన్నాడు మాధవరావుతో. "నిజంగారా, మాధవా. మా వదినని అన్నయ్య, అమ్మ కలిసి ఏడిపించేస్తున్నా

రనుకో. మా అమ్మ విషయం చెప్పానుగా? సినిమాలో అత్తగారి వంటిది. మొదటినుంచీ మా నాన్న నేర్పాటానికి గయ్యాళితనం. ఆస్తి ఆవిడ పేర ఉంది. మా నాన్న ఇల్లరికం అల్లుడుట. దానితోటి ఆడిం దాట, పాడింది పాటగా గడిచిపోయింది ఆయన కాలంలో. అదే ఆవిడకి అలవాటయిపోయింది.

అన్నయ్యది పూర్తిగా నాన్నగారి పోలిక. చదువుకుని ఉద్యోగం చేస్తున్నవాడు కదా, ఎందు కలా వణికిపోతాడో నా కర్థం కాదు. అమ్మ మాట వాడికి వేదం. ఈ వాతావర ణంలో వచ్చిపడింది వదిన. ఆవిడ గ్రాడ్యుయేటన్న మాటేగాని నోరు లేనిది. పూర్వకాలం మనిషి. విచారం ఏమిటంటే మా అమ్మ అసలు కాలేజీలో చదివిన పిల్లని చేసుకో

# నాతి చరామి

కనే పోను. కాని డిగ్రీదాకా చదువుకున్న పిల్లని కూడా చెప్పు చేతల్లో ఉంచుకున్నానన్న ఖ్యాతి రావాలని ఆవిడ కుతూహలం కాబోలు. ఇక వదిన కాపరానికి వచ్చినప్పటినుంచీ ఆవిడ చేసే ప్రతి పనీ, ఆడే ప్రతి మాటా రంగు టద్దాలలోంచి చూడసాగింది మా అమ్మ.

ప్రతిదాని వెనకా గర్వం, అహంకారం ఉన్నాయని ఊహించుకుని రభస చేయడం ఆవిడ ముఖ్యోద్దేశ్యం. అలా చేయడంవలన కోడల్ని అదుపులో పెడుతున్నా ననుకుం టూంది పాపం! కాని ఆవిడలో తనపట్ల

ప్రేమకు బదులు ద్వేషాన్ని పెంపొందించు కుంటున్నానని తెలుసుకోలేకపోయింది. పాల వంటి ఆమె మనస్సుని విరిచేసింది. మా అన్నయ్య సరేసరి. 'పెళ్ళాన్ని చావ కొట్టరా' అంటే కొట్టేసి తరువాత, 'క్షమించు, పార్వతీ' అంటాడు. తెలుగులో చెప్పాలంటే ఉట్టి 'మఫ్!' మనస్సు మాత్రం చాలా మంచిది. ఎవ్వరినీ కష్ట పెట్టలేదు. ఇద్దరిమధ్యా నలిగిపోలేక తప్పించుకు తిరుగుతున్నాడు.

మొదట నేను; వదిన పక్షం మాట్లాడి అమ్మతో పోట్లాడుతుంటే చివరికి మా ఇద్దరి మీదా కల్పించి అన్నయ్యకి నూరిపోసింది. వాడు విషయం తెలుసుకోలేక వదినని కొట్టడం, తిట్టడం మొదలెట్టాడు. వీటన్నిటికీ దూరంగా ఉండేందుకని నేను ఇవతలికి వచ్చే సింది." కుటుంబ పరిస్థితి యావత్తూ సూక్ష్మంగా వివరించాడు శంకరం మాధవ రావుకు.

కాసేపు ఎవరూ మాట్లాడలేదు. చివరికి శంకరం మళ్ళీ 'ఉదయంనుంచీ మా అమ్మ నోరు వింటూనే ఉన్నావుగా? ఒక్క రోజుకే మన కంత చిరాగ్గా ఉందే, రోజూ వింటూ పడు తున్న వదినకి ఎలా ఉంటుందా అనిపిస్తూం టుంది నాకు. అందులోనూ చదువుకున్నది కూడా పాపం' అన్నాడు.

మాధవరావు పార్వతి పరిస్థితిని ఊహించు కుని ఆవేశపడ్డాడు. 'మీ అన్నయ్య నొక సారి కలుసుకుని బెదిరించనా ఏమిటి—సరిగా చూడకపోతే చావకొడతానని?'

ఫక్కున నవ్వేశాడు శంకరం. 'ఒరేయ్, ఇదే మయినా సినిమాట్రా, భయపెట్టి కాపరాలు సరిచేయటానికి? అంతకన్నా మంచిది వాళ్ళిద్దరినీ కొన్ని రోజులపాటు వేరు చేయడమే!'

'అదెలా?'

'ఏముంది? నీ వెంట తీసుకెళ్ళి ఆవిడని పుట్టింటిలో దింపు. రెండు మూడు నెలలపాటు రాకుండా అక్కడే ఉంచితే ఇంటికి ఆవిడ ఎంత అవసరమో గ్రహించి అమ్మ, తన కెంత అవసరమో అర్థం చేసుకుని అన్నయ్యా దారికి వస్తారని నా ఉద్దేశ్యం. అమ్మ రాకపోయినా అన్నయ్య మారితే చాలు. మారతాడని నా నమ్మ కం కూడా! మగవాడికి తన అవసరాలు తీరు తున్నంతకాలం ఆడదాని విలువ, స్థానం తెలి యవు. అందుకే చలం అన్నాడు—భార్యా భర్తలు వేరు వేరు ఇండ్లలో ఉంటూ నిర్ణీతమైన రోజుల్లో కలుసుకుంటూ ఉండాలని. ఎడబాటు అనేది ఉంది చూశావూ, అది పరస్పరాకర్షణని, ప్రేమని పెంచుతుంది' అన్నాడు గంభీరంగా.

మాధవరావు నవ్వాడు. 'నువ్వు అనుభవం మీద చెప్పుతున్న మాటలని నేను కాదనగలనా? అయినా మనం వైజాగ్ వదిలివచ్చి ఇంకా మూడు రోజులయినా కాలేదు. అప్పుడే ఇంత విరహం అయితే ఎలారా! అక్కడ ఇందిర పరిస్థితి ఎలా ఉందో? చెలికత్తెల్ని పిలిచి అరిటాకుల్ని


## ప్రిన్స్ పాకెట్ రేడియో

సిగరెట్ కేసుకన్న చిన్నసైజు, తక్కువ బరువు కలది. దీనిని తేలికగా మీ జేబులో పెట్టుకొన వచ్చును. మిక్కిలి ఖర్చు తక్కువది, ఎలెక్ట్రిసిటీ గాని బ్యాటరీగాని లేకుండ పనిచేయించవచ్చును.



మధురమైన మనోహర మైన, శబ్దాన్నిస్తుంది. స్థానికంగా ప్రపంచపు ప్రతి స్టేషనును పలుకు తుంది. అనువైనది, అందమైన ధర రు. 30/—ప్రత్యేక నం. డి. 151—రు. 40/— వి. పి. పి. చార్జీలు రు. 3/50 అదనం. రేడియోకు తోలుకేసు రు. 5/—లు అదనం. లైసెన్సు ఫీ అదనం. త్వరగా సప్లయి కాబడుటకు రు. 10/— అడ్వాన్సుగ మనిఆర్డరు ద్వారా పంపండి. ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో మాత్రమే.

KUBER & CO., (APR),
L.R. Markct, P.O. Box 1268,
Delhi-6.

## మంచి రహస్యం

గ్లోరియా ద్రవాన్ని మీ ముఖానికి రుద్ది తుడిచినంతలో అద్భుతమైన కాంతిని, మంచి అందాన్ని వెంటనే తెచ్చును, ముఖంలో ముదిరూపును పోగొట్టి చక్కని లేతదనాన్ని తెచ్చును ఎండకువచ్చే, నలుపును, మొటిమలను నమ్మకంగా పోగొట్టును వెల రూ 1-75. అన్ని షాపుల్లో దొరుకును.

JANITA PRODUCTS, ELURU. A P

## మంచి పుస్తకాలు

జీవిత రహస్యాలు.- మీ దాంపత్యసుఖానికి అనేక కామ సూత్రాలు:- రూ 3-50
యువతి - స్త్రీలను గురించి అనేక కుతూహల విషయాలు రూ 3-50
సంతానము:- గర్భనిరోధానికి 60 నవీన సులభ మార్గాలు. రూ 3 50
వ్యాపార రహస్యాలు.- వ్యాపారంలో లక్షలు సంపాదించే అనేక కొత్తదారులు. రూ 6-00
ఉద్యోగదర్శిని.- మనదేశంలోని అన్నిరకాల ఉద్యోగాలు, అర్హతలు, పొందే మార్గాలు రూ 5-00
ఆత్మజ్ఞానము:- శరీరానంతరం ఆత్మను గురించిన నవీన శాస్త్ర పరిశోధనలు. రూ 2-50
పోష్టు ఖర్చులుచితం. క్రింది ఎడ్రస్సుకు వ్రాస్తే వి. పి. పోస్టుద్వారా మీయింటికి పంపబడును

దేశసేవ ప్రచురణలు, ఏలూరు, ఆంధ్ర

## రాంతీర్థ బ్రాహ్మీ నూనె

(స్పెషల్ నెం. 1) రిజిష్టర్డు



చుండు, వెంట్రుకలు రాలుట మాన్పి, వెంట్రుకలను పట్టువలె మృదువుగాను, కాంతిగాను నల్లగాను చేయు అమూల్యమైన హెయిర్ టానిక్. ఇది మెదడును చల్లబరచి, జ్ఞాపకశక్తిని పెం పొందించి కండ్ల వేడిమి, నిరంతర శిరోబాధ తగ్గించును. హాయిగా నిద్రపట్టించును.

యోగాసన చార్టు: సచిత్రమైన మా యోగాసన చిత్రపటంలో చూపిన వివిధ యోగాసనముల నిరంతర అభ్యాసము వల ఆరోగ్యకరమైన మంచి శరీరదార్ఢ్యత పొందండి.

## శ్రీ రాంతీర్థ యోగాశ్రం

దాదర్, బొంబాయి — 14.

పరిచి పూల పుప్పొడి చల్లమని ప్రాణం తీస్తాం దేమో!'

శంకరం కూడా నవ్వకుండా ఉండలేక పోయాడు. 'ఇందిర విషయం తరువాత ఆలోచిద్దాం. వదినకి కూడా ఆ విషయం చెప్పొద్దు సుమా! మా ఇంటిల్లిపాదినీ దిగ్భ్రాంతుల్ని చేయాలని నా ఉద్దేశ్యం. సరే ప్రస్తుత విషయానికి రా!!'

'వచ్చేందుకేముంది? పార్వతి నా వెంట వస్తానంటే తీసుకు వెళ్ళేందుకు నా కెటువంటి అభ్యంతరమూ లేదు.'

'అంత తామరాకుమీది నీటి బొట్టులా ఉంటే ఎలారా, భగవాన్లూ? ఆవిడ ఇద్దరికీ కావలసినదే కాబట్టి ఆలోచించి మరీ పుట్టాడు శ్రేయోభిలాషిగా!'

'సరే సంటినిగా?'

డాబామీదికి ఎక్కి ఆలోచిస్తూ కూర్చున్న పార్వతి క్రిందనుంచి భర్త పిలవడంతో నిదానంగా మెట్లు దిగి ఇంట్లోకి వెళ్ళింది. గదిలో నారాయణమూర్తి పచార్లు చేస్తున్నాడు. కోడలు రావడం చూసి గంగా భాగీరథిగారు ముఖం ముడుచుకుంది.

'మీ బావ వచ్చాట్టగా!' అన్నాడు నారాయణ గంభీరంగా.

'అవును' అంది నిర్లిప్తంగా పార్వతి.

తరువాత ఏం మాట్లాడాలో తెలియులేదు నారాయణకు. అందుకే తల్లివైపు చూశాడు. కొడుకు 'ప్రయోజకత్వం' ఎరుగున్నది కావడం చేత—

'నువ్వంటే ఆయనకి వల్లమాలిన ఆపేక్షటగా!' అంది హేళనగా.

చిరాకు కలిగింది పార్వతికి ఆ మాటతో. 'అంటే?'

'మరేం లేదు. మొదట నిన్ను ఆయనకి ఇద్దామనుకున్నారుట!'

'అవును.'

'మరెందుకు చేసుకోలేదో?'

'మా ఇంట్లో మేనరికాలు అచ్చిరావని మానేశారు.'


'మరి ఇప్పుడు ఆయనగారు ఇక్కడకు రావడంలో ఉద్దేశ్యం ఏమిటో?'

'ఏముంది? నన్ను చూసిపోదామని, శంకరంతో కలిసివచ్చాడు.'

'అంతేనా? నిన్ను కూడా తీసుకుపోదామని వచ్చాడేమోననుకున్నాలే.'

ఒళ్ళు మండిపోయింది పార్వతికి. 'ఇంత వరకూ ఎవరికీ ఆ ఉద్దేశ్యం లేదు. కాకపోతే ఇప్పుడే నిశ్చయించుకున్నాను వెడదామని. రేపు బావతో మా పుట్టింటికి వెడుతున్నాను' అంది నిర్లక్ష్యంగా.

'ఇక్కడ భాగవతం ఆడేందుకు అవకాశం లేదని ప్రయాణం అయ్యావన్నమాట. బాగుంది. బాగుంది.'



విధానసౌధ (బెంగుళూరు) ఫోటో—ద్రోణంరాజు మంగరాజారావు (భీమవరం)

మనిషిమీద ద్వేషం అనేది ఎంత తారస్థాయికి వెళ్ళవచ్చో అంతవరకు వెళ్ళింది పార్వతికి, అత్తగారిమీద.

''మీరు కాసేపు మాట్లాడకుండా నిలబడితే సంతోషిస్తాను'' అని భర్తవైపు తిరిగి, 'నేను పెళ్ళి చేసుకున్నది మీ అమ్మగారిని కాదు, మిమ్మల్ని. ఏమయినా అడగదలుచుకుంటే మీరే నన్ను అడగండి. ఆవిడకి సమాధానం చెప్పవలసిన గౌరవం ఏనాడో పోయింది' అంది.

నారాయణ తెల్లబోయాడు.

గంగా భాగీరథిగారు అవమానంతో పూనకం పట్టినదానిలా అయిపోయింది. 'ఎంతకి తెగించావే! చదువుకున్నానని అడ్డమయినవాళ్ళతోనూ సరాచికాలు ఆడుతూ కూర్చుంటావా? ఇంటిలో పను లెవరు చేస్తారనుకున్నావ్?'

కాని ఆవిణ్ణే లక్ష్యపెట్టలేదు పార్వతి. భర్తతోనే, 'నాలో ఎటువంటి దోషం లేదని మీకు మనస్సులో తెలుసు. ఇంతవరకు ఈ ఇల్లే స్వర్గమని, మీ కందరికీ సేవ చేయడమే నా పరమావధి అని మీ మాటలన్నీ పడ్డాను. నాలో సహనం నశించింది. నా పొట్ట నేనూ పోసుకోగలను. మీరు వస్తుతః మంచివారు. మీ హృదయం అతి మెత్తనిదని నాకు తెలుసు. కాని గ్రహణం పట్టినట్లు ఈవిడగారి ప్రభావానికి గురిఅయిపోతున్నారు. నేను వెళ్ళిపోతున్నాను. ఏనాడు మీకు నా అవసరం కనబడితే ఆనాడే నాకు తెలియజేయండి. నే నెప్పటికీ మీదాన్నే!' అంది.

''అది అంత లేసి మాట లంటుంటే చూస్తూ నిలబడతావేంరా, వాజమ్మా, నాలుగు తగిలించక? అడది ధనియాల జాతిరా. చెప్పు కింద రాయాలి.''

అప్పటికి ఏదో కర్తవ్యం బోధింపబడ్డవాడిలాగా నారాయణ గబుక్కున పార్వతిమీద చేయెత్తబోయాడు.

పార్వతికి అంత కోపంలోనూ నవ్వు వచ్చేసింది. 'దింపండి చేయి! మీరు కొడితే పడేందుకు నే నేమీ పల్లెటూరిదాన్ని కాను. మీతో సమానంగా చదువుకున్నాను, తెలుసా? ఆడదాన్ని చెప్పుకింద రాయాలని అమూల్యాభిప్రాయం వెలిబుచ్చారు మీ అమ్మగారు. అవును, నిజమే. ఆ గౌరవం లేకపోబట్టే ఆవిడ ఇలా తయారయ్యారు! ఇప్పటికయినా ఒక వ్యక్తిత్వం అలవరుచుకోండి మీరు. ఆవిడ కాదు మీకు శాశ్వతం, నేను!' అంటూ చరాలున గదిలోంచి బయటికి వచ్చేసింది.

శంకరం, మాధవరావు శిలాప్రతిమల్లా నిలబడి ఉన్నారు గుమ్మంలో! కలలోనయినా ఊహించనిది వారు వినటం, కనటం జరిగాయి.

పార్వతి మాత్రం ఏమీ జరగనట్టే నవ్వుతూ వాళ్ళ దగ్గరకువెళ్ళి, 'అలా నిలబడిపోయా రేం, శంకరం? పదండి, స్నానాలుచేసి భోంచేద్దురు గాని' అంది.

అంత ప్రశాంతంగా మాట్లాడుతున్న పార్వతిని చూస్తుంటే శంకరానికి ఆశ్చర్యం ఆగటం లేదు.

పార్వతి ఫక్కున నవ్వేసింది. 'ఆశ్చర్యపోతావెందుకు శంకరం? ఇంగ్లీషువాళ్ళ పద్ధతి నచ్చక వాళ్ళని బయటకు పంపించేందుకు మనవాళ్ళు సహాయనిరాకరణ చేశారు. కాని ఈ ఇంట్లో పరాయివాళ్ళెవరూ లేరుగా? అందుకే కొన్నాళ్ళ పాటు నేనే బయటికి పోదామని నిశ్చయించుకున్నాను. అంతే. రా, బావా. త్వరగా భోజనాలు

# ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

## ఉగాది నవలల పోటీ

## రు 2,500 లు బహుమతులు

శోభకృతు సంవత్సరారంభసమయంలో కూడా నవలల పోటీ నిర్వహించాలని సంకల్పించాము. రచయితలకు, రచయిత్రులకు ఇతోధికమైన ప్రోత్సాహం ఇవ్వడానికి నిశ్చయించాము.

**శోభకృతు ఉగాది నవలల పోటీలో గెలుపొందే నవలలకు ఈ దిగువ పేర్కొన్న విధంగా బహుమతులు ఇవ్వడానికి నిశ్చయించాము:**

**మొదటి బహుమతి రు 1,500 లు**

**రెండవ బహుమతి రు 600 లు**

**మూడవ బహుమతి రు 400 లు**

పోటీలో పాల్గొనే వారు పాటించవలసిన నిబంధనలు ఇవి:

1. రచన 250 అరఠావు కాగితాలకు మించరాదు.
2. సిరాతో, కాగితానికి ఒక ప్రక్కనే వ్రాయాలి.
3. ఇతివృత్తం ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలి.
4. సాంఘిక, చారిత్రక ఇతివృత్తం ఏదైనా ఎన్నుకొనవచ్చు.
5. అనువాదాలుకాక స్వీయ రచనలు మాత్రమే పోటీకి పంపాలి.
6. బహుమతిపొందని రచనలలో ప్రచురణార్హమైనవి ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉన్నది.
7. బహుమతి పొందని రచనలను, ప్రచురణార్హం కాని రచనలను త్రిప్పి పంపగలము.
8. పోటీకి పంపే రచనలను 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, చిత్తూరు'కు పంపాలి.
9. కవరుమీద 'ఉగాది నవలల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి.

**ఉగాది నవలల పోటీకి రచనలు మాకు చేరవలసిన ఆఖరితేది**

**1963 జనవరి 31**

రచయితలు ఈ అవకాశం వినియోగించుకొని, తమ సంపూర్ణ సహాయ సహకారాలు అందజేయాలని అర్థిస్తున్నాము. —ఎడిటర్

పూర్తి చేద్దాం. రేవు ఉదయమేగా మన ప్రయాణం?'

వెళ్ళేముందు భర్తతో చెబుదామని చూసింది పార్వతి. కాని ఆ సన్నివేశం ఎదుర్కొనే ధైర్యం లేని నారాయణ, సెలవు రోజయినా ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

రైలులో అడిగాడు మాధవరావు— 'పార్వతీ, తొందరపడ్డావేమో'నని.

## నాతి చరామి

కాని పార్వతి మాత్రం తొణక్కుండా జవాబిచ్చింది—'చాలా రోజులుగా నా మనస్సులో నలుగుతున్నది, బావా, ఇది. ఈనాటికి పరిస్థితుల ప్రభావంవలన ఒక నిర్ణయానికి వచ్చాను!' అని.

అతని మనస్సులోని శంక ఇంకా పూర్తిగా పోలేదు. 'నీ ఈ నిర్ణయానికి నేను కూడా కొంతవరకు బాధ్యుడనేమో!' అన్నాడు.

''అంటే?''

''మరేంలేదు. నీతోపాటు చదువుకున్న వాళ్ళు, ఎక్కడెక్కడ ఉన్నదీ, ఏం చేస్తున్నదీ చెప్పి నీకూ అటువంటి స్వేచ్ఛ జీవితంమీద ఆసక్తి కలిగించాను. నీ మనస్సులో ఉన్నదానికి ఒక రూపం ఇచ్చేందుకు 'కెటలిస్టు'గా పని చేశాను. నేను రాకపోతే ఇవ్వాళ నువ్వీ నిర్ణయానికి వచ్చేదానివి కావేమో!''

పార్వతి మాట్లాడలేదు. అత నడిగిన ప్రశ్నే తనను తను వేసుకుంది. ఆమె మౌనంగా ఉండిపోవడం చూసి మాధవరావు—

''అవును, పార్వతీ. నువ్విలా రావడంలో నా పాలు ఇంకా చాలా ఉండి ఉండేది. శంకరం, నేనూ కలిసి ఇందాకా అనుకున్నాం—కొన్నాళ్ళపాటు నువ్విలా వేరే ఉంటేనయినా మీ ఆయన మారతాడేమోనని! అలా అనుకుని ఇంటికి వచ్చేసరికి నీ నోటినుండి 'ఊరెడుతున్నాను' అన్న మాట విని ఆశ్చర్యపోయాం. భగవంతుడు అంతా మన మంచికే చేశాడనుకుందాం పార్వతీ. నారాయణమూర్తిలో మార్పు వస్తే అందరం ధన్యులమే!''

పార్వతి మాత్రం నీలవంగా నవ్వేసింది. 'మూడు సంవత్సరాలుగా ఆయనలో మార్పుకు ఓపికపట్టినదాన్ని, బావా, నేను. ఇక కాలం ఆయనలో కనువిప్పు కలిగించగలదన్న ఆశ నాకు లేదు. లేకపోతే అనకూడదు కాని ఆవిడ ఉన్నన్నిరోజులూ ఆయన మారరు!''


బండిలో ఇంటికి చేరుకుంటున్న పార్వతికి ఏదో తెలియని ఆందోళన, తప్పు చేసినదానిలా భయం కలగసాగాయి. తొందర పడ్డావని అంటారేమోనని దిగులు. అసలు పెళ్ళి జరిగాక గడిచిన మూడు సంవత్సరాలలోనూ తను పుట్టింటికి రెండేసార్లు వచ్చింది. ఆ రెండుసార్లకూ అత్తగారి అనుమతికోసం నాన్న ఎంతగా ప్రతిమాలవలసి వచ్చిందో తనకు తెలుసు. అప్పుడు తను రావటానికీ, ఇప్పుడు రావడంలోనూ కల వ్యత్యాసం తలుచుకుంటే కాలేజీలో చదివిన 'మేరీ అంటోయినెట్' గుర్తుకు వచ్చింది పార్వతికి. యువరాణిగా, నవవధువుగా అడుగిడుతుంది ఫ్రాన్సులోకి మేరీ. సకలలాంఛనాలతో వీధుల వెంట ఊరేగించుతూ రాజభవనానికి తీసుకువెడతారు. తరువాత కాలగతి ఆమె అదృష్టాన్ని మార్చేస్తుంది. ఫ్రెంచి విప్లవం అనంతరం ప్రజాశక్తి ఆమెను కూడా బంధించి 'గిలోటిన్' చేయాలని తీర్మానిస్తారు. అప్పుడు ఆ వధ్యస్థలానికి కప్పులేని బండిలో నిలబెట్టి, గొలుసులతో బంధించి వీధులగుండా తీసుకుపోతారు.

తన పరిస్థితిని ఆమెతో పోల్చుకోవడం పార్వతికే అసంబద్ధంగా తోచింది.

(సశేషం)

**జరిగిన కథ**

*అత్తగారుపెట్టే బాధలు భరించలేక, భర్త ప్రవర్తనతో ఆశలన్నీ అంతరించగా, మేనబావ రాక ఆధారం చేసుకొని, ఆతనితో కలిసి పుట్టినింటికి వెళ్ళింది పార్వతి.*






## (క్రిందటి సంచిక తరువాయి)

**అనుకోకుండా** కూతురు రాకకు మధుసూదనంగారు, ఆయన భార్య కూడా ఆశ్చర్యపోయారు. అందులోనూ కూతురు ముఖం చూసేసరికి అడుగుదా మనుకున్న మాటలు కూడా పెగిలి బయటికి రాలేదు. సంగతి ఏమి టన్నట్టు మాధవరావువైపు చూశా డాయన. ఇది గమనించిన పార్వతి, ''బావ నడుగుతా వేం, నాన్నా? నన్నే అడుగు. నువ్వు నాకు చదువు చెప్పించి పెద్ద పొరపాటు చేశావు. అదే లేకుండా ఉంటే నే నక్కడ గడుపుతున్న జీవితమే స్వర్గ తుల్యమనీ, ఆడది అంతకన్నా ఎక్కువగా కోరుకోడం మహాపాపమనీ భావించి సర్దుకుపోయే దాన్ని. కాని స్వేచ్ఛ అన్నది చవిచూసిన నాకు అది చాలా దుర్లభమయిపోయింది. అందుకే సరదాగా నువ్వు చెప్పించిన డిగ్రీని సార్థకం చేసుకోదలుచుకున్నాను'' అంది దృఢంగా.

పార్వతి తల్లి కాంతమ్మగారికి కూతురు ధోరణి పూర్తిగా అర్థం కాలేదు. అర్థమయినంతవరకు నచ్చలేదు. అందుకే భర్తవంక 'చదువులు వద్దండీ అంటే విన్నారూ?' అన్నట్లు చూసింది.

ఆయన మాత్రం కంగారు పడలేదు. ''ఆస

లేం జరిగిందమ్మా?" అన్నారు లాలనగా కూతు రును.

సాదరమయిన ఆ మాటతో పార్వతిలో నిక్షిప్త మయి ఉన్న దుఃఖమంతా పొంగి రాబోయింది. అది గమనించిన మాధవరావు గబుక్కున కల్పించు కుని, "అవన్నీ నేను చెబుతాలే గాని, మావయ్యా, ప్రస్తుత విషయం మాత్రం కొన్నాళ్ళపాటు పార్వతి ఇక్కడే ఉంటుంది. అంతకుమించిన వాడా వుడి మనం బయటికి కనబడనీయకూడదు. అంతే" అన్నాడు.

గిరుక్కున తిరిగి గదిలోకి వెళ్ళిపోయింది పార్వతి.

టూకీగా జరిగిన విషయాలు వివరించాడు మాధవరావు. "వాళ్ళ అత్తగారు చాలా గడుసుది మావయ్య. ఆవిడ కొడుకే ఆవిడని గురించి 'గయ్యాళిది మా అమ్మ' అన్నాడంటే ఇక ఊహించుకో. అయినా నీకు మాత్రం తెలియని దేముంది? అటువంటి వాతావరణంలో ఎవరూ ఒక్క క్షణం గడపలేరు. పార్వతి మూడు సంవత్స రాలు ఓపిక పట్టిందంటే నిజంగా ఆశ్చర్యమే! పార్వతిమొగుడికి అమ్మ మాట వేద వాక్కు. అందుకనే కొన్నాళ్ళపాటు ఇక్కడ ఉంటే మళ్ళీ పార్వతి మనస్సు బాగుపడచ్చు—మా అల్లుడిలో కూడ పరివర్తన రావచ్చు."

కాంతమ్మగారికి మాత్రం అత నేదో కొంత దాస్తున్నాడన్న అనుమానం కలిగి, "తెలియ కడుగుతాను. ఇలా వాళ్ళిద్దరూ వేరుగా ఉంటే కాపరం బాగుపడుతుందన్న అభిప్రాయం నీకు కలిగి పార్వతిని తీసుకువచ్చావా?" అంది.

మాధవరావు కూడా కాస్సేపు ఏమీ మాట్లాడ లేకపోయాడు. తరువాత "అసలు పార్వతి మరిది శంకరానికి కలిగింది ఈ ఆలోచన. నన్ను వెంట తీసుకుపొమ్మన్నాడు. సరే ననుకుని ఇద్దరం కలిసి ఇంటికి వచ్చేసరికి పార్వతే వాళ్ళ అత్తగారితో ఆ మాట అంటోంది. కాబట్టి నేను చెప్ప వచ్చేదేమంటే ప్రత్యక్షంగా ప్రస్తుతం జరిగిన దానిలో నాకు ఎటువంటి ప్రమేయం లేదు!" అన్నాడు.

# నాతిచరామి

మధుసూదనంగారికి వీళ్ళ సంభాషణ అట్టే నచ్చలేదు. "అదేమిటే, ఆ రాక్షసి కొంపలో ఉండలేక అది ఊపిరి పీల్చుకుందామని ఇక్కడికి వస్తే మధ్య వాడిని పట్టుకు నిల దీస్తావు? అసలు దాని మొగుడికి బుద్ధి వచ్చి, వేరే కాపరం పెట్టేదాకా నేనే దాన్ని పంపించను, తెలిసిందా? అంతగా దానికి తోచకపోతే ఉద్యోగం చేసుకుంటుంది హాయిగా! సుఖపడని కాపరాలు ఉన్నా ఒకటే, ఊడినా ఒకటే! వాడే దారికి వస్తాడు. ఏరా మాధవా, ఇంతకీ నువ్వు ఇంటికి వెళ్ళలేదు కదూ!" అన్నాడు.

"అవును, మావయ్యా. నేరుగా ఇటే వచ్చే శాను. మళ్ళీ వస్తాలే!" అని వెళ్ళిపోయాడు.

నచ్చి నెల రోజులయినా వెళ్ళకపోవడం, కనీసం అటువంటి ప్రయత్నమయినా చేయకపోవడంతో అమ్మలక్కలకు కూడా అనుమానం కలిగి పార్వతి విషయంపట్ల వారికి ఉత్సాహం పెరిగింది.

"అన తెందు కొచ్చినట్టు—ఏదో అయుం టుంది! అనాడే అనుకున్నాను పిన్నీ, నేను" వంటి మాటలు లీలగా బయల్దేరాయి.

పార్వతి ఇలా అర్థాంతరంగా వచ్చేయడం నచ్చని కాంతమ్మగారు ఈ విమర్శలతోను, ఎదు రవుతున్న ప్రశ్నలతోనూ ఉక్కిరి బిక్కిరి కాసాగింది.

అసలే పార్వతిని చదివించటం ఆవిడ ఇష్టా నికి వ్యతిరేకంగా జరిగింది. ఇప్పుడు కూతురు అత్తవారిల్లు వదిలిరావడానికి కారణం కూడా ఆ అనవసరమయిన చదువేనని ఆవిడ దృఢ నమ్మకం. కాని ఆ మాట ఇంట్లో అంటే వినే వారు లేరు. మరొకరితో చెప్పుకో తగినది కాదు.

మింగాలేక, కక్కాలేక తల్లి పడుతున్న బాధ గ్రహించకపోలేదు పార్వతి. నిజానికి పుట్టి, పద్దెనిమిది సంవత్సరాలు పెరిగిన పుట్టిల్లు ఆమెకు కూడా పరాయి ఇల్లులాగానే ఉంది.

మజిలీ

చిత్రం—బి. శశి (పెనుపెద్దిపాలెం)



పార్వతికి ప్రాణం విసిగిపోయింది.

అందుకే ఒక రోజున తండ్రితో అనేసింది. "నాన్నగారూ, మళ్ళీ నేను అక్కడికి వెళ్ళిపోతాను" అని.

మధుసూదనంగారు ఆశ్చర్యపోయారు. "అదేమిటమ్మా, ఇంకొన్ని రోజులు పోనీయి. అప్పుడు అతనే కాళ్ళ బేరానికి వస్తాడు. ఇక్కడ నీకు కష్ట మేమిటి?" అన్నారు.

తన మనస్సులో అనుకుంటూ, బయటికి అంటే కూతురు మనస్సెక్కడ బాధ పడుతుందో నని బాధ పడుతున్న కాంతమ్మగారికి పార్వతి మాటలు అమృతధారల్లా ఉన్నాయి. అందుకే ఆవిడ ఈ అవకాశం జారవిడవ దలుచుకోలేదు.

"మీ రూరుకోండి, దానికై అది వెడతా నంటుంటే! అయినా అత్తగారిల్లు అన్న తరు వాత పుట్టింటిలాగా ఉండమంటే ఎలా? మే మంతా పడ్డవాళ్ళం కామూ! కొన్నాళ్ళు పోయాక వాళ్ళే మారతారు. ఆవిడ మాత్రం శాశ్వతమా! పెద్దది, ఆవిడ మాటే అవునంటే పోయిం దేముంది? కాపురాలు కలియటం మంచిది కాని విడిపోవడం ఎంత సేపు? ఊళ్ళో వాళ్ళకి చెప్పలేక నా ప్రాణం పోతూంది!" అంది.

ఆయనకు మాత్రం ఈ వరస నచ్చలేదు. "కన్నకూతురు కష్ట పడుతోందన్న దానికంటే ఊళ్ళోవాళ్ళ మాటలే నీకు ఎక్కువన్నమాట! నీ బాధ చూసే అదలా అంటూంది. నేనుమాత్రం దాన్ని చూస్తూ చూస్తూ ఆ నరకంలోకి పంపించను."

లోపలికి వస్తున్న మాధవరావు ఈ మాటలు విని, "ఏమిటి మావయ్యా ఎవరిని పంపించ నంటు న్నావు?" అన్నాడు.

"వేళకి వచ్చావురా, మాధవా. పార్వతి మళ్ళీ అక్కడికి వెడతా నంటోంది."

ఆశ్చర్యపోయాడు మాధవరావు. "ఏం, పార్వతీ నిజమేనా?"

పార్వతి మాట్లాడకుండా తల వంచుకుని ఇంట్లోకి వెళ్ళిపోయింది.

"వెడతా నందిలే! కాని నా ఉద్దేశ్యం మాత్రం అత న్నొకసారి ఇక్కడికి రమ్మనమని రాసి, నాలుగు చివాట్లు వేసి పంపడం మంచిదేమోనని."

"చివాట్లేస్తే అతను మాత్రం పౌరుషం ఉన్నవాడు కాదూ! ఆడపిల్ల వాళ్ళం మనకే ఇన్ని పట్టింపులూ, కోపాలూ ఉంటే—అయినా, అత నేమయినా పంపాడు కనుకనా రమ్మని రాయ డానికి! దానంత టది వచ్చింది కాబట్టి మళ్ళీ మనమే వదిలి రావాలి" అంది కాంతమ్మగారు.

మాధవరావు ఏం మాట్లాడలేదు. అసలు తనా సన్నివేశంలో అక్కడికి రావడమే తప్పని గ్రహించి ఊరుకున్నాడు.

తువ్వెవ్వు మాట్లాడేవారు లేకపోవడంతో మధుసూదనంగారికి భార్య చెప్పినదానిలో కొంత సబబు కనిపించింది. "సరేలే. ఫలానా రోజున



హిమాలయ పాదపాలలో

ఫోటో—లజపత్ రాయ్ (డెరాడూన్)

తీసుకువస్తానని రాస్తాను. ఏరా, మాధవా?" అని కాస్సేపాగి, "అన్నట్టు ఉద్యోగంలో చేరతావా, లేక రీసెర్చికి వెడతావా?" అనడిగారు.

"గుంటూరులో వచ్చింది మావయ్యా, లెక్చరరుగా. ఇవ్వాళ వెడుతున్నాను ఇంటర్వ్యూకి. మళ్ళీ రెండు రోజుల్లో వచ్చేస్తాను."

వ్రాసిన ఉత్తరానికి తిరుగు టపాలో వచ్చిన సమాధానంచూసి నిర్విణ్ణులయిపోయారు ఇంటిల్లిపాదీ. కాంతమ్మగారయితే ఏడుపే ప్రారంభించింది. పార్వతి కూడా కలలోనయినా అనుకోలేదు ఈ పరిణామాన్ని. అందుకే బ్రమపడిపోయింది—'చదువుకున్నవాడు. తన విషయం పూర్తిగా తెలిసినవాడు. కేవలం తల్లి మాట విని ఇంతగా దిగజారిపోయాడేమో'—అని.

గబ గబ మాధవరావుకు కబురుచేసి అతను రాగానే ఉత్తరం అతని చేతిలోపెట్టి చదవమన్నారు. అతను చదవ సాగాడు.

"మీ అమ్మాయి మా ఇంటిలో ఎవరి మాటా లక్ష్యపెట్టకుండా మీ మేనల్లుడు మాధవరావుతో లేచిపోయింది. వెడుతూ వెడుతూ మా అమ్మని అన్న మాటలు ఈనాటికీ మేము మరిచిపోలేదు. లేచిపోయినవాళ్ళని తీసి తెచ్చుకునే అవసరం మాకు పట్టలేదు. మీరు తెచ్చే ప్రయత్నం చేయబోకండి. మీ అమ్మాయే వచ్చి మా అమ్మకి క్షమాపణలు చెప్పుకుంటే తప్ప ఇంతటితో మీకూ మాకూ సంబంధం తెగిపోయినట్లే

నారాయణమూర్తి."

"తెలివితక్కువ దద్దమ్మ. కీలుబొమ్మ! పోయి వాడిని నాలుగు వాయించి రమ్మంటావా మావయ్యా" అన్నాడు ఆవేశంగా మాధవరావు.

"వాడిని వాయిస్తే మన కేమొస్తుంది? ఇప్పుడు కర్తవ్యం ఏమిటి అని ఆలోచించాలి కాని!"

"ఏముంది? పార్వతి చదువుకోని దేమీ కాదు. డిగ్రీదాకా చదువుకుంది. టైపు పాసయింది. సరదాకోసం అప్పుడు నేర్చుకున్నవి ఇప్పుడు పనికి వస్తాయి. ఉద్యోగం చేస్తుంది. అందువలన దానికి కూడా ఈ ఆలోచనలు రాకుండా కాలం సరదాగా గడిచిపోతుంది."

కాని మధుమాధవరావుగారికి మాత్రం మనస్సు సమాధానపడలేదు. "ఏమిటి దీని వలన లాభం? అలా ఎన్నాళ్ళు చేస్తుంది? ఆడది ఉద్యోగం చేస్తే మనవైపు బ్రతకనిస్తారా?"

"పొరబడుతున్నావు, మావయ్యా—ఆడది చదువుకునే రోజులు వచ్చాయని గ్రహించబట్టే గదా నువ్వు పార్వతిని చదివించావు, ఎవరెన్ని మాటలన్నా, చివరికి అత్తయ్య విమర్శించినా? అలాగే చదువుకున్న ఆడ పిల్లలు ఇంతమంది వస్తుంటే ఉద్యోగం చేసేవాళ్ళు మాత్రం ఉండరూ వాళ్ళలో? జీవచ్ఛవంలా ఆదర్శం కోసం బ్రతికే కన్నా విమర్శల నెదుర్కొని మన మనస్సుకి నచ్చినట్టు బ్రతకటమే మంచిది. ఏం, పార్వతీ, నీ ఉద్దేశ్యం ఏమిటి?"

"నన్ను గురించి, నా శీలం గురించి అంత నమ్మకం లేనివాళ్ళఇంటిలో ఉండేకన్నా ఇంకేం చేసినా నా కిష్టమే! ఉద్యోగం చేయటానికి నా కెటువంటి అభ్యంతరమూ లేకపోగా ఇష్టం కూడా, బావా!" అంది దృఢంగా.

కాంతమ్మగారికి పరిస్థితి చేజారిపోతూందనిపించింది. "బాగుందర్రా వరస. వయస్సులో ఉన్న పిల్ల మొగుణ్ణి వదిలి ఉద్యోగాలు చేస్తుంటే ఇంకేమయినా ఉందా? పరువు నిలవాలనేనా! పెద్దది, అత్తగారు, ఆవిడతో తప్పయిపోయిందత్తయ్య—అంటే అవమానమా! ఈ అతి తెలివితోనే ఇంతవరకు తెచ్చారు" అంది.

"ఒక్క మాట వినత్తయ్యా. మనం అంతా కలిసి పట్టుపడితే పార్వతి అక్కడికి వెళ్ళనూ వెడుతుంది. ఆవిడ కాళ్ళమీద పడమన్నా పడుతుంది. కాని అక్కడి జీవితం భరించలేక, ఇక్కడికి రావడం మనం హర్షించమన్న భయంతో ప్రాణం తీసుకుంటుంది. అప్పు డేం చేస్తావు? కాబట్టి ఒక్కళ్ళు ఏమనుకుంటారో నన్న భయంకన్నా ముఖ్యం వాళ్ళమీద సానుభూతి కలిగిఉండటం, వాళ్ళమీద వాళ్ళకి విశ్వాసం కలిగింపజేయడం. తరువాత ఏమవుతుందంటావు. ఏమయినా కావచ్చు. అతని మనస్సు మారి అతనే దాని దగ్గరకు రావచ్చు. లేదా ఆ స్వేచ్ఛా జీవితం కన్నా భర్తదగ్గర, అత్తగారి దగ్గర తిట్లు తింటూ ఉండటం మంచి దనిపిస్తే పార్వతే వాళ్ళ ఇంటికి వెళ్ళి ఇద్దరి కాళ్ళమీదా పడనూ వచ్చు."

ఉద్రేకంగా మాట్లాడిన మాధవరావు మాటలు మధుసూధనరావుకు నచ్చాయి. తటపటాయిస్తున్న ఆయనలో నిశ్చయాన్ని కలిగించాయి.

పార్వతికి కూడా తను వేస్తున్న ప్రతి అడుగూ తప్పటడుగేమోనన్న భయం పోయి, భవిష్యత్తుమీద ఆశను చిగురింపజేశాయి ఆ మాటలు.

"అయితే, మాధవా, ఇప్పుడు ఉద్యోగం చేయడానికే నిశ్చయించాం కదా? తరువాతి ప్రశ్న 'ఎక్కడ, ఎటువంటి ఉద్యోగం' అన్నది" అన్నా రాయన.

మాధవరావు నవ్వేశాడు. "దానిదేముంది, మావయ్యా? రావలసిన పేరు ఎటూ వచ్చింది, నాతో లేచి వచ్చేసిందని! ఇప్పుడూ నేనే లేవదీసుకుపోతాను. నా కెటూ గుంటూరులో ఉద్యోగం అయింది కదా. పార్వతికి నేనే ప్రయత్నిస్తాను. గుంటూరులో పార్వతి స్నేహితురాలు సుమిత్రా వాళ్ళ ఇల్లు ఉంది. ఆ అమ్మాయి కూడా ఉద్యోగం చేస్తూందిలే. వాళ్ళింట్లో ఒక గది తీసుకుందాం—మనవాళ్ళేలే!"

ఈ కొత్త జీవితం మొదట బాగానే కనబడింది పార్వతికి. ఇన్నాళ్ళుగా తను కన్న కలలు పండి తనకు లభ్యమయిన స్వేచ్ఛా జీవితం కలగానే కరిగిపోతుందేమోనని భయపడేది. నెల మొత్తం కష్టపడి తను సంపాదించుకున్న డబ్బును తన మనస్సుకు నచ్చినట్టు ఖర్చు చేసుకోగలగటం, రకరకాలవాళ్ళతో పరిచయం—అన్నీ బాగానే ఉండేవి. అప్పుడప్పుడు సుమిత్రతో సహా ముగ్గురూ కలిసి సినిమాకు వెడుతుండేవారు.

కాని చైతన్యవంతమయిన దినచర్య అయిపోయి రాత్రిపూట ఒంటరిగా గదిలో పడుకున్నప్పుడు మాత్రం గతం జ్ఞప్తికి వచ్చేది. తను గడుపుతున్న జీవితంలో ఏదో లోపం, వెలితి పొడసూపేవి. దిండు తడిసిపోయేది!

పార్వతికి సుమిత్రను చూస్తే చాలా వింతగా ఉండేది. ఎవరు తనవంక చూస్తున్నా పట్టించుకునేది కాదు, పైగా అలా తనవంక చూడటమే వాళ్ళ కర్తవ్యమయినట్లు మాట్లాడేది.

వచ్చిన నెల రోజులలోనూ పార్వతి గ్రహించినది మరొకటి ఉంది. అది సుమిత్రకు, మాధవరావుకు మధ్య గల స్నేహం. అది మామూలు స్నేహం మాత్రమే కాదు, అంతకన్న ఉన్నతమయినదేనని గ్రహించటానికి ఆమెకు అట్టేకాలం పట్టలేదు. అది ఆమెకు ఆనందాన్ని కూడా కలుగజేసింది. ఇంచుమించు

# నాతిచరామి

రోజూ కాలేజీ అయిపోగానే వచ్చేవాడు మాధవరావు. సుమిత్ర ఆఫీసు కూడా దగ్గరే కాబట్టి పార్వతి వచ్చేప్పటికి వాళ్ళిద్దరూ గదిలో కూర్చుని మాట్లాడుకుంటూ ఉండేవాళ్ళు. ఎందుకయినా మంచిదని చిన్నగా దగ్గి తన రాకను తెలియపరిచేది పార్వతి. తరువాత ముగ్గురూ కలిసి మూడు నిమిషాల్లో చీకటిని తెప్పించేవాళ్ళు.

ఒక రోజు పార్వతి ఆఫీసునుంచి రాగానే మాధవరావు, "పార్వతీ, నీ కీ రోజు ముఖ్యమయిన శుభవార్త చెప్పదలుచుకున్నాను. కాసుక్కో" అన్నాడు నవ్వుతూ.

పార్వతికి గబుక్కున అర్థమయిపోయింది. "ఏముంది? విందు చేయబోతున్నారు నాకు. సుమిత్రాదేవి శ్రీమతి అవబోతూంది" అందా మనుకుంది. కాని అంతలోనే ఆ విషయం పసి కట్టేసిన సుమిత్ర, "అల్లరి పిల్లా, అదేం కాదులే. చెప్పండి మాధవ్. లేకపోతే ఇప్పుడు ఊహాగానాలతో నా ప్రాణం తీస్తుంది" అంది.

మాధవరావు జేబులోంచి ఉత్తరం తీసి, "శంకరం రాశాడు. ఇందులోని ఒక భాగం సారాంశం ఏమిటో తెలుసా? తను గృహస్థు అయాడుట" అన్నాడు.

ఆశ్చర్యపోయింది పార్వతి. "నిజంగా?"

"అక్షరాలని కాదంటే నేను చెప్పగలిగిం దేముంది? విను. 'ఇందిరా, నేనూ రిజిస్టరు మ్యారేజి చేసుకున్నాము. మొదట ఈ వార్త విని అమ్మ పసింద్రీలాగ ఆడిపోయింది. కాని 'ఏం లాభం లేదు. సంతకాలు పెట్టేశాను. తన్నుకు చావ' మన్నాను. తరువాత కులం, గోత్రం అన్నీ సక్రమమయినవేనని, చదువుకున్నదీ, అందమయినదీ, డబ్బున్న వాళ్ళ అమ్మాయేనని, అన్నిటికీ మించి నాది మొండి పట్టుదల అని గ్రహించి సర్దుకుంది. ఇది జరిగి అప్పుడే పది రోజులయింది. ఇప్పుడు అందరం మామూలుగా ఆ ఇంట్లోనే ఉన్నాము. ఈ వార్త వదినకి చెప్పి ఆవిడ ఆశీర్వాదాలు పంపవలసినది.' ఇంతవరకు నీకు సంబంధించినది. తరువాతిది నా కన్న మాట."

పార్వతికి ఆ ఆశ్చర్యంనుంచి కోలుకోవటానికి కొంతసేపు పట్టింది. "కాని, సుమిత్రా, మా ఇంటిని—అదే వాళ్ళ ఇంటిని ఒక దారికి తేగలిగినవాడు అతనొక్కడే! నిప్పులాంటి మనిషనుకో. మనసారా నమ్మినదాన్ని కచ్చితంగా అమలుపరిచి చూపిస్తాడు" అని ఒక్కసారి నిట్టూర్చింది.

పరిస్థితి కొంచెం వక్రించబోతూందని గ్రహించిన మాధవరావు, "సరే గాని, అమ్మాయి గారూ, అతిథుల్ని కూర్చోపెట్టి నిట్టూర్పులేనా లేక కాఫీ వగైరా ఇవ్వటమంటూ ఉంటుందా? పూర్వకాలంలో, అంటే ఏదీ—పల్లెటూళ్ళలో పెరుగూ,పాలూ దొరికే రోజుల్లో, ముందు ఎవరయినా ఇంటికి వస్తే వారికి కాళ్ళకి నీళ్ళు ఇచ్చి, దాహానికి మజ్జిగ ఇచ్చి తరువాత కుశలం అడిగేవారుట. ఇప్పుడు వాడెందుకు వచ్చాడా అని కళ్ళనీళ్ళు ముందు. తరువాత వాడిని సాగనంపడం ఎలాగన్న ఆలోచన. 'ఆః, మీ ఎత్తు ధనం పోసినా మాబోటివాళ్ళ ఇంట్లో ఉంటారుటండీ' అనడం. ఆ దెబ్బతో వాడు అదిరిపోయి, 'అవును సుమీ. వస్తా' అని పారిపోవడం! నాలాంటి మొండి ఘటమయితే 'మీరు మరీ అంత నిష్ఠూరంగా మాట్లాడుతున్నారనే రెండు రోజులుపాటు మీ మనస్సుకి సంతృప్తి కలిగించి మరీ వెడదామని వచ్చాను. మరేమీ తొందర పడల్లేవులెండి' అంటాడు. ఆః! పెద్ద ఉపన్యాసమిచ్చి అలిసిపోయాను. పార్వతీ చప్పున కప్పు కాఫీ అందుకోవాలి" అన్నాడు.

"మూర్తీభవించిన స్వార్థం పార్వతీ, మీ బావ. మనిద్దరినీ వదిలేసి తనొక్కడూ తాగుతాడుట? పద పద, కాఫీ కాద్దాం" అంటూ లేవబోయింది సుమిత్ర.

"ఎందుకులే? నువ్వు మాట్లాడుతూండు. అయిదు నిమిషాల్లో చేసి తీసుకు వస్తాను" అని పెరటిలోకి వెళ్ళింది నీళ్ళకోసం పార్వతి.

ఆమె వెళ్ళడం గమనించి, "ఏమిటి, ఇందాక ఉత్తరంలో కొంత దాచారు—నాకూ చెప్పకూడనిదా?" అనడిగింది సుమిత్ర.

"నువ్వు మాత్రం ఇంకోరికి చెప్పకూడనిది: శంకరం, నేనూ కలిసి ఒక ప్లాను వేశాంలే. అది అమల్లో పెడుతున్నాడుట!"

"ఏమిటో అది?"

"వాడూ, ఇందిరా కలిసి ఇంటిల్లిపాదినీ ఊదరకొట్టేయడం. ఇందిర పనేమీ చేయకుండా టెక్కామీద మేకులాగా కూర్చుంటుందన్నమాట. అత్తగారు ఏమయినా అంటే శంకరంతో చెప్పుతుంది. వాడు వెళ్ళి, 'మాటలు పడి, వెట్టిచాకిరి చేసేందుకు వదిన అనుకున్నావు కాబోలు. ఇందిర చాలా నాజూకు మనిషి. కావాలంటే తేలిక పనులు చేయించుకో. అన్నాలదగ్గర మంచినీళ్ళు పెట్టడం వంటివి' అని అరుస్తాడు.

తరువాత ఇక అన్నగారికి వినబడేట్టుగా సరదాగా మాట్లాడుకోవడం, నవ్వుకోవడం, అతను చూసేట్టుగా కలిసి తిరగడం వగైరా—అలా చేస్తే నారాయణకికూడా పార్వతి జ్ఞప్తికి వస్తుంది. 'చెప్పుడు మాటలు విని చెడిపోవడానికి నే నేమీ అన్నయ్యను కాను' అంటాడుట మాట మాటకి. ఏతావతా వాడి ప్రయత్నం ఏమిటంటే—నారాయణకి అడుగడుగునా పార్వతిని గుర్తుచేయడం, సాంసారిక జీవితంమీదికి మనస్సు మళ్ళించడం! వాళ్ళ అమ్మకి పెద్ద కోడలు అంత చాకిరి చేసినా ఏడిపించాను, చిన్నది మేకై కూర్చుంది, అదే ఉంటే ఎంత బావుండును? అనిపించేట్టు చేయడం. నువ్వు మాత్రం పొరపాటునయినా పార్వతితో అనకు సుమీ. ప్లానంతా పాడయిపోతుంది. పార్వతి వస్తూంది."

రోజులు గడిచిపోతున్నాయి. పార్వతికి ఈ జీవితంలోని నవ్యత్వం నశించిపోయి దిగజారిపోయింది. భోజనంచేసి ఆఫీసుకు బయలుదేరిన దగ్గిరనుంచి తిరిగి మళ్ళీ ఇంటికి చేరుకునేదాకా ఎన్ని వేలకండ్లు రోజూ తనని నఖ శిఖ పర్యంతం పరీక్షిస్తున్నాయో గ్రహించుకుని సిగ్గుతో క్రుంగిపోయేది.

అయిదు కాగానే టైంచూసుకుని లేచి నిలబడింది పార్వతి, ఇంటికిపోదామని. పొద్దుటినుంచి చాకిరీచేసి స్వేచ్ఛావాయువు పీల్చుకుందామన్న తహతహతో గుమాస్తాలంతా లేచి నిలబడుతున్నారన్న దానికి నిదర్శనంగా కుర్చీలు వెనక్కు తోసిన చప్పుళ్ళతో ఆఫీసు మార్మోగిపోతూంది. ఆ రోజునే కొన్న పత్రిక చేతిలో పట్టుకుని ఇవతలికి రాబోయింది. ఇంతలోకే ప్యూన్ వచ్చి, "సాబ్ మిమ్మల్ని ఉండమంటున్నారు. హెడ్డాఫీసునుంచి వైరు వచ్చిందిట. దానికి సమాధానం రాస్తారుట. మిమ్మల్ని పెన్సిలు, బుక్కు తెచ్చుకోమన్నారు" అన్నాడు నవ్వుతూ.

అక్కడ చేరిన రెండు నెలల సర్వీసులోనూ తనను అయిదయాక ఉండమనడం అదే ప్రథమం కావటాన కొంచెం ఆశ్చర్యం వేసింది పార్వతికి. అందుకనే వెంటనే మాట తీసెయ్యలేక మెల్లిగా స్ప్రింగ్ డోరు నెట్టుకుని లోపలికి వెళ్ళింది.

అక్కడాయన లేడు.

టైము చూసుకుంది. అప్పుడే పావుగంట దాటింది. పైన గోడగడియారం శబ్దం తప్పించి ఆఫీసంతా నిశ్శబ్దంగా ఉంది.

ఇంతలో పక్కనున్న గదిలోంచి వస్తూ, "కూర్చో, పార్వతీ, నిలబడిపోయావేం? మనలో మనకి ఈ గౌరవా లెందుకు?"



హాసవిలాసం

ఫోటో—పి. కృష్ణమూర్తి (రాజమండ్రి)

అన్నాడు ఆఫీసరు శ్రీపతి.

అతనికన్న ముందుగా గుమ్మని తన దగ్గర కొచ్చిన వానకు అదిరి తలెత్తి చూసింది పార్వతి. ఆయన కళ్ళు ఎర్రగా చింత నిప్పుల్లా ఉన్నాయి. మనిషి కొంచెం తూలుతున్నాడన్న అనుమానం కూడా కలిగింది.

పార్వతికి గుండెల్లో రాయి పడింది!

"త్వరగా లెటర్ డిక్టేట్ చేయండి. నా కవతల పనుంది" అంది కంగారుగా.

నవ్వేశాడు శ్రీపతి. "పరవాలేదులే, పార్వతీ. రహిమాన్ని కాఫీకి పంపించాను. ఈలోగా కాస్త కమ్మని కబుర్లు చెబుదూ!" అంటూ వచ్చి ఆమె కెదురుగా బల్లమీద కూర్చున్నాడు.

వణికిపోయింది పార్వతి. గబుక్కున లేచి నిలబడి, "ఇవ్వాళ మీరు మనిషి సరిగాలేరు. రేపుదయం చెప్పుదురుగాని లెటర్. సెలవు" అంటూ కదలబోయింది.

గబుక్కున చేయి పట్టుకున్నాడు శ్రీపతి. "అవును, పార్వతీ. మనిషినే కాదు. నా మనస్సు కూడా బాగాలేదు. అందుకే నిన్నుండమన్నది" అంటూ దగ్గరకు లాక్కున్నాడు.

ఒక్కసారిగా భయం పోయి ఆమెను కోపం ఆవరించుకుంది. దానితోపాటే పశుబలంతో తనను దగ్గరకు లాక్కుంటున్న శ్రీపతిని గట్టిగా ఒక్క తోపు తోసేసింది. అనుకోని ఈ చర్యకు బల్లమీద పడబోయి నిలదొక్కుకున్నా డతను.

"ఛీ, ఛీ! మీరు మంచివారనుకున్నాను ఇన్నాళ్ళూ. ఇంత పశుప్రవృత్తి ఉందనుకోలేదు" అంది అసహ్యంగా.

ఆయన కొంచెం తెల్లబోయాడు. "మొగుణ్ణి వదిలి లేచిపోయొచ్చిన దానివి నువ్వు నాకు నీతులు చెబుతావా? అయినా అనవసరంగా ఒకరి నొకరం అల్లరి పెట్టుకోవడం ఎందుకు? బయటకి అనకపోయినా ఇద్దరం ఒక్కలాంటివారమే. కమాన్" అంటూ మళ్ళీ దగ్గరగా రాబోయాడు.

చెంప ఛెళ్ళుమంది!

అతనికైపు దిగిపోయింది. నిర్విణ్ణుడయి పోయాడు.

పార్వతి ఏడుస్తూ తలుపు తీసుకుని పోబోయింది.

"పార్వతీ!" అన్నాడు.

ఆగి, ఏమిట న్నట్లు చూసింది.

"మీరూ, అందరు సెక్రటరీల్లాంటివారే ననుకున్నాను. క్షమించండి. రేపు మామూలుగా ఆఫీసుకు వచ్చేయండి. మీ సీటు హాల్లో వేయిస్తాను. ఇక వెళ్ళండి" అన్నాడు.

బయట కాఫీ ఫ్లాస్కు, పొట్లాలతో రహిమాన్ ఎదురై, అప్పుడే వెళ్ళిపోతున్న పార్వతిని చూసి ఆగబోయి, అంతలో ఆమె ముఖం చూడటంతో మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయాడు.

పార్వతి మనస్సంతా అల్లకల్లోలంగా ఉంది. అసలు ఆడదాన్ని ఆనందం ఇచ్చే వస్తువుగా తప్ప ఒక స్నేహితురాలిలాగా చూడనేలేరా అనిపించింది. కాని ఆ దృష్టి ఆడవాళ్ళలోనే కొందరు కలిగిస్తున్నారన్న ఆలోచన ఆమెకు కలగలేదు!

కలతబారిన మనస్సుతో ఆనా డామె కండ్లు మూత పడలేదు.

మర్నాడు ఆఫీసులో తనవందరూ వింతగా చూడటం, దానికి తోడు తన సీటు వాళ్ళ మధ్యకు రావడం—ఇవన్నీ ఆమెను మరింత బాధించాయి. ఎవరు ఎక్కడ నిలబడి మాట్లాడుకుంటున్నా తనను గురించేనని, తను తల వంచుకుని పని చేసుకుంటున్నా అందరూ తన వంకే చూస్తున్నారని తెలుసుకోవడానికి ఆమెకు ఆట్టేసేపు పట్టలేదు. తనకు వినబడాలని వాళ్ళు అనుకునే మాటలు వింటుంటే ఆ క్షణంలో తిరగబడి అందరితో పోట్లాడేద్దామని, జరిగినదంతా వివరించి ఇందులో తన దోష మేమిటో నిలదీసి అడిగేద్దా మన్నంత రోషం కలిగింది.

"సీటు మారిం దేమిటి గురూ?"

"రహిమాన్ చెప్పాడుగా—బేరం కుదరలేదుట! చాలా హైక్లాసుటలే!" కిసుక్కున నవ్వారు కొందరు.

'ఛీ, ఛీ! ఈ తోడేళ్ళకన్న చేయబోయిన తప్పు తెలుసుకున్న ఆ శ్రీపతే నయం' అనుకుంది మనస్సులో.

ఆనాడు పనేమీ సాగలేదు.

బయటికి వచ్చేస్తుంటే నరసింహమూర్తి దగ్గరగా వచ్చి "చూడండి, పార్వతిగారూ, మా వాళ్ళ ప్రవర్తనే అంత. మనిషిని కళ్ళతోనే తినేసేట్టు చూడటం, నోటితో చచ్చే మాటలనడం అలవాటుపార్వతీ. నలుగురిలోనూ తిరగని సిన వారు మీరు. ఇటువంటి మాటలు లెక్కచేయడం మానుకోవాలి. బాధపడినకొద్దీ పొడిచి చంపుతారు. పట్టించుకోనట్టు తిరిగేస్తే మీ జోలికి రారు" అన్నాడు.

చనువు తీసుకుని సానుభూతి చూపుతున్న అతని మాటలకు ఆశ్చర్యపోయింది పార్వతి. అతనిపట్ల గౌరవం కూడా కలిగింది. కనీసం ఇటువంటి వాడితోనయినా జరిగింది చెప్పి తన నిజాయితీ చాటుకోవాలని, "మీ మాటలకి చాలా థ్యాంక్సండి. అసలు నిన్న సాయంత్రం" అంటూ చెప్పబోయింది.

కాని గబుక్కున మధ్యలోనే అందుకుని, "నా కన్నీ తెలుసునండి. రహిమాన్ చెప్పిన దాన్నిబట్టి, మీ వాలకం, మీ నడవడినిబట్టి నిజం ఊహించగలిగాను. శ్రీపతి కూడా అసలు సెక్రెటరీని వేసుకోవడం ఆ ఉద్దేశ్యంతోనే. కాని మనిషి వస్తుతః మంచివాడు. కనుకనే మీమీద అత్యాచారం చేయకుండా తప్పు గ్రహించుకుని వదిలేసి ఉంటాడు. మీ సీటు తన గదిలోంచి తీసేసి హాల్లో వేయించడంటే అర్థం తెలుసా?" అన్నాడు.

"ఏమిటి?" అంది ఆశ్చర్యంగా.



క్రీడా వినోదం

ఫోటో—పి. శివశంకర్ (కలకత్తా)

"సాధ్యమయినంత త్వరలో ఉద్యోగం మానేసి తనదారికి అడ్డులెమ్మని. అప్పుడు ఇంకొకరిని తీసుకుంటాడు ఆ ఖాళీలోకి. మనిషి మంచివాడు లెండి. పాపం భార్య పోయింది. అప్పటినుంచి ఇలా తయారయాడు."

ఈ నాలుగు మాటలతో నరసింహమూర్తితో ఎంతో పరిచయ మున్నట్లనిపించింది పార్వతికి. లోకమంతా ఒక్కటే మూసలో పోసినట్టుగా భావిస్తున్న తను పొరపడ్డా ననుకుంది. ఆఫీసులో విరోధుల మధ్యఉన్నట్లుగా కూర్చునేకన్న కనీసం ఒక సహృదయుడితో మాట్లాడుతూ ఉండే అదృష్టమయినా కలిగింది కదా అని ఆనందపడ్డది.

ఆనాటినుంచి మధ్య మధ్య నరసింహమూర్తితో కలిసి నడుస్తూ ఆఫీసు విషయాలు మాట్లాడుతూ రావడం ఆమెకు అలవాటయింది. దానికి తోడు కొన్నాళ్ళుగా సుమిత్ర తనతో ఆట్టే మాట్లాడకపోవడం కూడా గమనించిన పార్వతికి అందుకు కారణం మాత్రం దురూహ్యమయింది. తను కల్పించుకుని మాట్లాడినా ఏదో పనున్నదానిలా విదిలించుకుపోతున్న సుమిత్రను తెల్లపోతూ చూడటమే చేయగలిగిన పనయింది.

కాని తరువాత మాధవరావునుంచి కూడా సుమిత్ర తప్పించుకు తిరుగుతూందని, అతను మాట్లాడించినా సరిగ్గా మాట్లాడటం లేదని గమనించిన పార్వతి అసలు విషయం కొద్దిగా ఊహించ కలిగింది. అది తనపట్ల, మాధవరావు పట్ల సుమిత్ర కేవో కొన్ని అనుమానాలు బయలుదేరాయని! అందుకనే అవి నిరాధారాలని చూపించాలని తను కూడా మాధవరావుతో మాట్లాడటం తగ్గించివేసింది పార్వతి. క్రమేణా ఇంటిదగ్గర వాతావరణం కూడా కుళ్ళిపోతున్న ట్లనిపించింది ఆమెకు.

ఇంటిదగ్గర మనసారా మాట్లాడే సుమిత్ర

అంటే ముట్టనట్లుగా ఉండటం, ఆమెకోసం తను మాధవరావుతో ముభావంగా ఉండటం వలన పొద్దుపుచ్చటం ఒక ప్రశ్న అయింది. సరిగా ఆ సమయంలో సానుభూతితో తనను పలకరించిన నరసింహమూర్తి ఆమెకు పేదకు పెన్నిధిలా కనుపించాడు. స్వంత చెల్లెల్ని ఆదరించినట్లు మాట్లాడే అతని మాటల్లోని ఆత్మీయత ఆమె మనస్సును ఓదార్చేది.

అందుకనే అతనితో సాధ్యమయినంతసేపు మాట్లాడుతూ వివిధ విషయాల గురించి చర్చిస్తూ ఉండేది. ఈ విషయంలో తన వెనుక చాలామంది నవ్వుకుంటున్నారని తెలిసినా ఆమె వేటినీ లక్ష్యపెట్ట దలచుకోలేదు.

ఒకరోజు ఆఫీసునుంచి వస్తూంటే నరసింహమూర్తి గబగబ వచ్చి కలుసుకుని, "పార్వతీ దేవిగారూ, ఇవాళ మీరు మా ఇంటికి రావాలి. మా ఆవిడతో మిమ్మల్ని తీసుకువస్తానని చెప్పాను" అన్నాడు.

అంతవరకు పార్వతి అతను కుటుంబ సమేతంగా ఉంటున్నా డనుకోలేదు. అందుకనే కొంచెం ఆశ్చర్యంగా, అయితే ఎన్నడూ చెప్పారు కారేం? తప్పకుండా వెడదాం పదండి" అంటూ అతన్ననుసరించింది.

"మీరు దూరం రానవసరం లేదులెండి. ఈ సందు మొగదలోనే ఇల్లు" అని ఆమెను ఒక సందులోకి తీసుకుపోయి మేడమీద గది, వరండా ఉన్న ఇంటిని చూపించి "అదే రండి" అంటూ లోనికి దారితీశాడు.

గబగబ తను ముందు మెట్లెక్కి తలుపు తాళంతీసి, "రండి—లోపల కూర్చోమండండి. పక్కవారింటికి వెళ్ళినట్లుంది. పిల్చుకువస్తాను" అన్నాడు.

గదిలోకి నడిచింది పార్వతి. అందులో

# నాతిచరామి

ఆమె ఆశ్చర్యం కలిగించిన విషయం—ఎక్కడా ఆడవాళ్ళు ఉన్న లక్షణం లేకపోవడం. ఎక్కడ చూసినా బ్రహ్మచారుల గదిలాగానే ఉందితప్ప... అంతలోనే ఆమెకు గబుక్కున ఒక అనుమానం వచ్చింది. వచ్చిందే తడవుగా వెనక్కు తిరిగింది. నరసింహమూర్తి తలుపులు వేసే చప్పుడు చేయకుండా గడియపెట్టే ప్రయత్నంలో ఉన్నాడు!

మౌనం గ్రహించిన మరుక్షణంలో మెరుపులా అతని మీదికి దూకి తలుపు ఒక్క ఊపున తెరిచి వరండాలోకి వచ్చేసింది పార్వతి.

అనుకోని ఈ సంఘటనకు తెల్లబోయాడతను.

"నువ్వు తేనె పూసిన కత్తివన్న విషయం గ్రహించలేకపోవడం నా తప్పు, మిస్టర్. ఇన్నాళ్ళూ విన్నాక అన్నగారుగా చూశాను. ఇంత నీచానికి ఒడిగడతా వనుకోలేదు. నీ సానుభూతి మాటలు నిజమని నమ్మాను. కాని వాటివెనుక ఇంతటి ఎత్తుగడ ఉందనుకోలేదు" అంది మెట్లమీద నిలబడే కోపంతో.

"అల్లరి చేయకు, పార్వతీ, నీ బావకన్నా తీసిపోయినవాడినేం కాను. ఏం కావాలన్నా ఇయ్యగలను. బోలెడు ఆస్తి ఉంది నాకు" అన్నాడు వెకిలిగా.

"గంగలో కలుపుకో. కావాలంటే నువ్వూ దూకు. పీడా పోతుంది" అని చరచర క్రిందికి దిగి వచ్చేసింది.

తనకు జరగబోయిన ప్రమాదం గురించి తలుచుకుంటే కాళ్ళు వణికిపోయాయి ఆమెకు!



తోడునీడలు ఫోటో—కె. సీతారామన్ (తిరుప్పూరు)

ఒక్క క్షణంలో భగవంతుడు కాపాడాడు కాని లేకపోతే సర్వనాశనం అయిపోయేది తను!

కలలో నడిచినట్లు ఇంటికి వచ్చేసింది. బయట నీలకంఠం నిలబడి ఉన్నాడు. అంటే సుమిత్ర అన్నగారు.

"నమస్తే" అన్నాడు నవ్వుతూ.

మాట్లాడకుండా తాళంతీసి లోపలికి నడిచింది పార్వతి.

జరిగిన సంఘటనలతో పార్వతిలో సహనం పూర్తిగా నశించిపోయింది. ఆడది ఒంటరిగా ఉండి గౌరవంగా మనగల స్థాయికి సమాజం పెరగలేదు. ఆడదాన్ని సవ్యాదయంతో అర్థం చేసుకోగలపాటి విజ్ఞానం లేదు. కాలగతికి ఎదురీదటం నేల విడిచిన సాము వంటిది. అందరినీ ఎదిర్చి నిలవగల ధైర్యం, తెగింపు తనకులేవు. తనకు కావలసినది, తనను పూర్తిగా అర్థం చేసుకోగలిగినది సుమిత్ర కూడా తనను అపార్థం చేసుకుంటే ఇంకా బయటివారిని అని ఏం ప్రయోజనం?

ఆలోచనల్లో మునిగిపోయిన పార్వతికి తన నెవరో పిలిచినట్లయి తెప్పరిలి చూసింది. అప్పటికి గాని నీలకంఠం తనతోపాటు లోనికి వచ్చాడని, వచ్చినవాడు నేరుగా తన పక్కకే వచ్చి తనను అనుకునేంత దగ్గరగా నిలబడి ఉన్నాడని గ్రహించలేదు. వెంటనే "ఏమిటి? ముందు మీరు వెళ్ళి ఆ కుర్చీలో కూర్చుని తరవాత మాట్లాడండి" అంది తీక్ష్ణంగా.

వెకిలి నవ్వు నవ్వాడు, నీలకంఠం.

"మా చెల్లాయి వాళ్ళూ ఇప్పుడు రారులే. ఎందుకంత భయం? అయినా నీలకంఠం అంటే పేటు మొత్తానికి హడలు! మా ఆఫీసరు విన్నేదో అన్నాట్టగా?"

"అది మీ కనవసరం."

"అవున్లే. ఏదో మొదట కొట్టు చేయక పోతే బావుండదని కాదని ఉంటావు. అహా—నేను చెప్పేది, కావాలంటే, నువ్వు 'ఊఁ' అంటే వాడిని చావకొట్టించి రాగలను!"

"ఆ పని కుక్క కూడా చేయగలదు."

"మాటలు జాగ్రత్తగా రానీయ్! నిన్ను నేనేం చేసినా ఇక్కడ విన్నారుకునేవా రెవరూ లేరు. నీ కేకలు విన్నా నీలకంఠానికి ఎదురుగా రాగల మగాడు లేడు, జాగ్రత్త!"

"మగవాడి బలంకన్న ఆడదాని శక్తి అవసరం వస్తే ఎక్కువని గుర్తుంచుకో, నీలకంఠం! నీ చెల్లెల్ని ఎవరన్నా ఏమన్నా అంటే కాట్ల కుక్కలాగా మీద పడతావే—పరాయి ఆడది మట్టుకు అటువంటిది కాదా? నీ అంత బలమయిన అన్నగారు నాకూ ఉంటే వాడు నిన్ను చావకొట్టడూ? ప్లీజ్, గెటవుట్. నీవంటివాడితో మాట్లాడుతూ వ్యర్థం చేసేందుకు నే నేమీ నీలాగా పనిలేనిదాన్ని కాను. కుటుంబాన్ని పోషించలేక చెల్లెలిచేత ఉద్యోగం చేయిస్తున్న నువ్వూ ఒక మగాడివేనా?"

అంది చిరాగ్గా.

వేడుకోలేతప్ప ఎదిరించనేది ఎరగని నీల కంఠం మండిపడ్డాడు. పిచ్చిగా ఒక్క నవ్వు నవ్వాడు. "చూస్తాను ఎవ రడ్డమొస్తారో. నీ అన్నగారో లేక...."

"బావ! నరా. వెనక్కి రా ముందు." గుమ్మం కొంచే అరిచాడు మాధవరావు.

ఎందర్ని ఎదిరించినా చెల్లెలంటే మాత్రం గౌరవం ఉంది నీలకంఠానికి. ఆమెనుబట్టి మాధవరావు అంటేమా. చేజిక్కిన పిట్టను వదులుకున్నంత బాధగా 'హాఁ' అని గిరుక్కున వెనక్కి తిరిగి బయటికి వెళ్ళిపోయాడు నీల కంఠం.

చేతుల్లో ముఖం కప్పుకుని కూలబడిపోయింది పార్వతి.

"ఎందుకు, పార్వతీ, ఏడుస్తావు? జీవితం అనేది పూలబాట కాదు. వడ్డించిన విస్తరి వంటి జీవితాలు ఏ కొద్దిమంది అదృష్టవంతు లకో!" అన్నాడు ఆర్ద్రంగా మాధవరావు.

గబుక్కున తలెత్తి "రెండు రోజుల్లో నేను అక్కడికి వెళ్ళిపోతాను బావా" అంది హఠా త్తుగా పార్వతి.

ఆశ్చర్యపోయాడు మాధవరావు. "ఎక్కడికి?"

"ఆయనగారి దగ్గరికి! ఇక్కడంయిన అను భవాలు చాలు! స్వేచ్ఛాజీవితం ఇంత కంటకా వృతమని అనుకోలేదు."

కాస్సేపు మాధవరావు ఏమీ మాట్లాడకుండా ఆమెనే చూస్తూండిపోయాడు. రెండు నెలల కాలంలో మానసికంగా ఎన్నో అనుభవాలు పొందింది పార్వతి. తనంత మనిషి అలా కుమిలి కుమిలి ఏడుస్తూ కూర్చుంటే అతని మనస్సు తరుక్కుపోయింది.

"నా కనిపిస్తుంటుంది, పార్వతీ, భగవంతుడే ఆడదానికి తీరని అన్యాయం చేశాడేమోనని! ఎక్కడా లేని ఆకర్షణ ఆమెలో పెట్టాడు. కాని అది రక్షించుకునేందుకు తగిన బలం ఇవ్వకపోవ డంలో ఆయన ఉద్దేశ్యం ఏమిటో! మగవాడి నీడన తప్ప వేరే మనుగడ లేకుండా చేయడం తప్పు! వెళ్ళిపో, పార్వతీ. అదే ఉత్తమమయిన మార్గం. అపనిందలు పడుతూ, తోడేళ్ళవంటి ఈ మగాళ్ళమధ్య బ్రతకటమే స్వేచ్ఛ అనుకునే కన్న ఆత్మవంచన వేరే లేదు. నేను కూడా రానా?"

అంత దుఃఖంలోనూ నవ్వు వచ్చింది పార్వ తికి. "నర్లే, బాగానే ఉంటుంది. కాశీకి వెడుతూ పిల్లిని చంకన బెట్టుకువెళ్ళాట్ట! ఇప్పటికే అక్కడవాళ్ళు, ఇక్కడ..." అని గబుక్కున ఆపేసింది.

బయట నిలబడి ఉన్న సుమిత్ర అందుకుని నవ్వుతూ, "ఆపేశా వేం, పార్వతీ—'ఇక్కడ సుమిత్ర మనిద్దరిని గురించి పడుతున్న అను మానాలు చాలు'—అని పూర్తి చేయక? నువ్వు నన్ను క్షమించాలి, పార్వతీ. అనవసరంగా ఈ మధ్య నీమీద కక్షపూని మాట్లాడటం తగ్గించేశాను. నా భయం ఏమిటో తెలుసా — అక్కడ మీ ఆయన మారే బదులు ఇక్కడ మీ బావ మనస్సు మారుతుందేమోనని! కాని ఈ రోజే మాధవ్ అంతర్యం తెలిసింది. నీ కుటుంబంలోకి నిన్ను చేర్చేదాకా మే మిద్దరం ఇలా ఉండవలసినదే అన్నాడు. ఇప్పుడు మా కోసం నిన్ను వెళ్ళమనటం లేదు సుమీ. ఎటూ వెళ్ళటానికే నిశ్చయించుకున్నావు కనుక చెప్పాను. అంతే. నన్ను క్షమిస్తావు గదూ?" అంది సుమిత్ర.

"బయలుదేరి వస్తున్నాను. మీరు నడుచు కొమ్మన్న విధంగా నడుచుకుంటాను. మీ పాదాలవద్ద నా స్థానం నాకిస్తారని ఆశిస్తు న్నాను" అని వ్రాసి, వ్రాసిన విధంగా బయలు దేరింది పార్వతి.

స్టేషనుకు సుమిత్ర, మాధవరావు వచ్చారు.

"శంకరం, ఇందిర కూడా అక్కడే ఉన్నారు కాబట్టి మరీ అంత అధ్వాన్నంగా ఉండదు, పార్వతీ, జీవితం. పైగా అతనుకూడా ఈపాటికి బహుశా కొంతవరకు వ్యక్తిత్వం అలవరుచుకుని ఉంటాడు" అన్నాడు మాధవరావు.

పేలవంగా నవ్వేసింది పార్వతి.

ఏదో పార్వతికి ధైర్యంగా ఉండేందుకు రెండు మాటలు మాట్లాడుదామని ప్రయ త్నించబోయిన సుమిత్ర ఆ నవ్వు చూసి విర మించుకుంది.

జీవితంతో పోట్లాడి పూర్తిగా పరాజయం పొంది ఓటమిని అంగీకరించిన నవ్వు అది!

"ఇప్పుడు పరిస్థితులు ఎలా ఉన్నా సర్దుకు పోగల అనుభవాన్ని ప్రసాదించాడు, బావా, దేముడు" అంది మెల్లిగా.

దారి పొడుగునా ఆమె మనస్సులో రకరకాల ప్రశ్నలు వేధించసాగాయి. అసలు తనను కనీసం ఇంట్లోకయినా రానిస్తారా? ఆమాత్రం అదృష్టం అయినా కలుగనీయకపోతే తనేం చేయాలి? భగవంతుని మనసారా ప్రార్థించుకుంది ఈ అవ కాశమయినా ఇమ్మని.

విజయవాడ ప్లాట్‌ఫారమ్ మీదికి రాగానే దూరంగా నారాయణమూర్తి కనబడడంతో పార్వతి గుండె ఒక్క క్షణం స్పందించటం మానేసింది. 'ఈయన ఇక్కడున్నా రేమిటి? కొంపతీసి తన రాక ఇష్టంలేక ఎక్కడికయినా వెళ్ళిపోవటం లేదు కదా!' అని గుప్పిట్లో ప్రాణాలు పెట్టుకుని అతని వైపే చూస్తూ కూర్చుంది, ఏం చేస్తాడా అని.

రైలుకు ఆ చివరనుంచి ఒక్కొక్క పెట్టె పరిశీలనగా చూసుకుంటూ వస్తున్నాడు, నారా యణ. ఆ చూసే తీరు చూస్తుంటే ఎందుకో ఆశ పొటమరించింది ఆమెలో. చివరికి ఆమె కూర్చున్న పెట్టెదగ్గరకు వచ్చి కిటికీలోంచి చూస్తున్న ఆమెను చూడగానే "అమ్మయ్యా! ఇక్కడున్నావన్నమాట!" అన్నాడు సంతృప్తిగా.

అంత సౌమ్యమయిన మాటను ఆశించని పార్వతి ఆనందం పట్టలేక గబ గబ పెట్టె దిగి, "నన్ను క్షమించండి. జీవితంలో పూర్తిగా అలిసి పోయాను. మీరు చెప్పిన విధంగా నడుచు కుంటాను. మీ పాదాల దగ్గర చోటివ్వండి." అంది ఆవేశంతో.

ఆమె వంకే ఆశ్చర్యంగా చూస్తున్న నారా యణ ఆమె కండ్లలో సుళ్ళు తిరుగుతున్న కన్నీళ్ళు తుడిచి, "పిచ్చి పిల్లా, ఎందుకు ఏడు స్తావు? మా తమ్ముడి పుణ్యమా అని నీ విలువ నాకు తెలిసింది. గతం ఒక పీడకల మనిద్దరికీ! ఈ పాడు లోకానికి దూరంగా బ్రతుకుదాం పద" అన్నాడు నవ్వుతూ.

పార్వతికి ఆయన ధోరణి అర్థంకాక ముఖ మెత్తి సజల నయనాలతో అతన్ని చూసింది.

"అవును, పార్వతీ, నేను మద్రాసు బదిలీ చేయించుకున్నాను. అలా స్వామిని దర్శించుకుని కొత్త జీవితం ప్రారంభిద్దాం!"



సర్పరాజు సహాలు
ఫోటో—ఇందుపూరు లక్ష్మణరావు (పార్వతీపురం)

ఆమెకు అది కలేమోనన్న భ్రమ కలిగింది. కాని పక్క ప్లాట్‌ఫారంమీది కెనేడియన్ ఇంజను కూతతో కాదని తేల్చుకుని "మరి అత్త గారు?" అంది.

"నన్ను మరమ్మత్తు చేశారు శంకరం, ఇందిర. అమ్మని కూడా మార్చాక మద్రాసు తీసుకు వెడదాం! రైలుకి టికెట్లు కూడా కొనే శాను. విన్నావుగా మనకి స్వాగతం పలుకు తోంది!—పద" అంటూ అది ప్లాటుఫారం అనయినా గమనించకుండా చేతో ఆమెను చుట్టేసి నడిపించ సాగాడు.

తన సామానులు పెట్టెలో ఉండిపోయా యన్న ఆలోచనే లేకుండా అతనిమీదికి వాలి పోయి నడవసాగింది పార్వతి.

ప్లాటుఫారమంతా గన్నుల దీపాలు వెలి గాయి! ★